తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
ఖమ్మం - నల్లగొండ
భద్రాద్రి కొత్తగూడెం
సూర్యాపేట
యాద్రాద్రి భువనగిరి
గురువారం
10 సెప్టెంబర్ 2026
పేజీలు : 8
Follow :



# కరెంటు కోతలపై ప్రజల ఆందోళన

○రాత్రివేళ గంటల తరబడి సరఫరా నిలిచిపోతోందంటున్న స్థానికులు

○24 గంటల విద్యుత్‌కు సరిపడా విద్యుత్ అందుబాటులో ఉంది : డీఈ జీవన్‌కుమార్

**అశ్వాపురం, సెప్టెంబర్ 9 (జనంసాక్షి):** మండలం వ్యాప్తంగా విద్యుత్ సరఫరాపై ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ముఖ్యంగా రాత్రి వేళల్లో తరచూ విద్యుత్ సరఫరా నిలిచిపోతుండటంతో చిన్న పిల్లలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఓవర్‌లోడ్, లైన్ సమస్యల పేరుతో గంట నుంచి రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతున్న సందర్భాలు ఉన్నాయని వారు చెబుతున్నారు. విద్యుత్ సరఫరాలో సాంకేతిక సమస్యలు, ఓవర్‌లోడ్ వంటి కారణాలతో అప్పుడప్పుడు అంతరాయం ఏర్పడటం సాధారణమే అయినప్పటికీ, రాత్రి వేళల్లో తరచుగా విద్యుత్ నిలిచిపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు ఉన్న కుటుంబాలు రాత్రి సమయంలో విద్యుత్ లేక తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నామని చెబుతున్నారు.

**ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు: డీఈ జీవన్‌కుమార్**

కాగా, విద్యుత్ కోతలపై వస్తున్న ఆరోపణలను విద్యుత్ శాఖ డీఈ జీవన్‌కుమార్ ఖండించారు. మండలంలో రెగ్యులర్‌గా విద్యుత్ కోతలు విధిస్తున్నారన్న ప్రచారంలో వాస్తవం లేదని స్పష్టం చేశారు. తెలంగాణలో 24 గంటల విద్యుత్ సరఫరాకు అవసరమైన విద్యుత్ అందుబాటులో ఉందని, ప్రజలు అనవసరంగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. ఏదైనా సాంకేతిక లోపం, లైన్ సమస్య లేదా ఇతర అత్యవసర పరిస్థితుల కారణంగా కొద్దిసేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే, దానిని సాధారణ విద్యుత్ కోతగా భావించవద్దని సూచించారు. విద్యుత్ సరఫరాను నిరంతరాయంగా కొనసాగించేందుకు శాఖ వద్ద అవసరమైన మౌలిక సదుపాయాలు, సాంకేతిక వ్యవస్థలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

**సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలను నమ్మొద్దు:**

విద్యుత్ కోతలకు సంబంధించి పూర్తి సమాచారం తెలుసుకోకుండా సోషల్ మీడియా, యూట్యూబ్ ఛానళ్లలో అసత్య లేదా అసంబద్ధమైన సమాచారాన్ని ప్రచారం చేయవద్దని వార్తా లోపలి పేజీలో

పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయక

## విగ్రహాలనే పూజించాలి

కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట (జనంసాక్షి):** పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఈ వినాయక చవితిని పర్యావరణహితంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరు మట్టితో తయారు చేసిన వినాయక విగ్రహాలను ప్రతిష్టించి పూజించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పిలుపునిచ్చారు. బుధవారం కలెక్టరేట్ లో కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో గోడ పత్రికను ఆవిష్కరించి మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణ ప్రజలందరి బాధ్యత అని అన్నారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్ విగ్రహాలు, కృత్రిమ రంగుల వినియోగం వల్ల నీటి వనరులు కలుషితమయ్యే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ మట్టితో తయారు చేసిన గణనాధులను పూజించి పర్యావరణ హితానికి మేలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి ఏఈఎస్ డా. పురుషోత్తం రెడ్డి, వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యంగా ఉంటేనే ప్రజలకు మెరుగైన సేవలు

సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ

**సూర్యాపేట (జనంసాక్షి):** పోలీస్ సిబ్బంది నిరంతరం విధి నిర్వహణలో ఒత్తిడిని ఎదుర్కొంటూ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయవద్దని, పోలీసులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే సమాజానికి విలువైన సేవలు, పూర్తి రక్షణ కల్పించవచ్చని జిల్లా ఎస్పీ కె.నరసింహ పేర్కొన్నారు. పోలీస్ సిబ్బంది సంక్షేమంలో భాగంగా బుధవారం పోలీస్ జిల్లా కార్యాలయంలో ఆర్వీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, హెల్త్‌ఫై హాస్పిటల్, సూర్యాపేట కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ వారి సంయుక్త సహకారంతో పోలీస్ సిబ్బందికి, వారి కుటుంబ సభ్యులకు గుండె, ఇతర ఆరోగ్య సమస్యలపై ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే సమాజం కూడా ఆరోగ్యంగా ఉంటుందని తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా సిబ్బంది ఎంతో పని ఒత్తిడితో, నిర్విరామంగా విధులు నిర్వహిస్తూ తమ ఆరోగ్యంపై శ్రద్ధ చూపలేకపోతున్నారని అన్నారు. అందుకే పోలీస్ శాఖ వారి సంక్షేమానికి, ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ నిత్యం ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. పోలీస్ సిబ్బంది అంతా ఒకే కుటుంబమని, ప్రతి ఒక్కరూ ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం వార్తా లోపలి పేజీలో



# కాళోజీ సాహిత్యం ఆచరణీయం : కలెక్టర్ బి. చంద్రశేఖర్



**నల్లగొండ ప్రతినిధి, సెప్టెంబర్ 9,(జనంసాక్షి):** ప్రజాకవి, పద్మ విభూషణ్ కాళోజీ నారాయణరావు సాహిత్యం ప్రతి ఒక్కరికీ ఆచరణీయమని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు. కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకుని బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కాళోజీ చిత్రపటానికి కలెక్టర్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 1914 సెప్టెంబర్ 9న జన్మించిన కాళోజీ నారాయణరావు చిన్ననాటి నుంచే సాహిత్యంపై పట్టు సాధించి, విభిన్న భాషల్లో ప్రావీణ్యం సంపాదించారని తెలిపారు. 1941లో తన తొలి కవితను ప్రచురించిన కాళోజీ, తన తుదిశ్వాస వరకు సాహిత్య రంగంలో విశేష సేవలందించారని పేర్కొన్నారు. ముఖ్యంగా తెలంగాణ సాహిత్యంలో ఆయన ముద్ర చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. సమాజంలోని సమస్యలను ప్రశ్నిస్తూ కాళోజీ రాసిన కవితలు, తెలంగాణ ఉద్యమ సమయంలో ఆయన వ్యక్తం చేసిన భావాలు రాష్ట్ర సాధనకు ఎంతో దోహదపడ్డాయని కలెక్టర్ తెలిపారు. కాళోజీ సేవలను గుర్తిస్తూ రాష్ట్ర ప్రభుత్వం హెల్త్ యూనివర్సిటీకి కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీగా నామకరణం చేసిందని అన్నారు. మర్రి విత్తనమంత చిన్న పద్యంలో మహావృక్షమంత అర్థం కాళోజీ కవితల ప్రత్యేకత అని పేర్కొన్నారు. కాళోజీ తన సాహిత్యం, భావజాలం ద్వారా తెలంగాణ ప్రజలకు వార్తా లోపలి పేజీలో

ఖమ్మం జిల్లాలో ఇద్దరు విద్యార్థులు

# దుర్మరణం..!



గురుకుల పాఠశాల విద్యార్థికి గుండెపోటు..

అధికారుల అలసత్వమేనని విద్యార్థి సంఘాల ఆందోళన..

ఇంటర్ విద్యార్థి ఉరి వేసుకొని బలవన్మరణం..



ఇరు కుటుంబాల్లో తీవ్ర విషాదం..!

**ఉమ్మడి ఖమ్మం జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 09(జనంసాక్షి).** ఖమ్మం జిల్లాలో జరిగిన రెండు వేర్వేరు సంఘటనలు తీవ్ర కలకలం రేపాయి.. అభం శుభం తెలియని ఓ బాలుడు గుండె పోటుతో దుర్మరణం పాలవగా.. ఖమ్మంలోని ఒక ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ చదువుతున్న విద్యార్థి ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు.. బాధిత కుటుంబాలు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గం రఘునాధపాలెం మండల కేంద్రంలోని జ్యోతిబా పూలే బీసీ బాలుర గురుకుల పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న సాత్విక్(13) బుధవారం ఉదయం ఒక్కసారిగా కుప్పకూలాడు. తోటి విద్యార్థులతో ఆడుకుంటుండగా కిందపడి అపస్మారక స్థితిలోకి వెళ్ళాడు. అతడిని స్థానిక ఉపాధ్యాయులు హుటాహుటిన ఖమ్మంలోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాలుడిని పరీక్షించిన వైద్యులు, అప్పటికే మరణించినట్లు నిర్ధారించి భౌతిక కాయాన్ని మార్చురీకి తరలించారు. మృతుడి స్వస్థలం తిరుమలాయపాలెం వార్తా లోపలి పేజీలో

# మంత్రి పొంగులేటి తక్షణమే రాజీనామా చేయాలి



**ఖమ్మం కార్పొరేషన్, సెప్టెంబర్ 09 ( జనంసాక్షి)** రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారిన 22ఏ (నిషేధిత ఆస్తుల జాబితా) భూముల సమస్యపై భారతీయ జనతా పార్టీ సమరశంఖం పూరించింది. దశాబ్దాలుగా అనుభవిస్తున్న సొంత భూములపై హక్కులు లేక, క్రయవిక్రయాలు చేసుకోలేక లక్షలాది మంది పేద, మధ్యతరగతి రైతాంగం తీవ్ర అవస్థలు పడుతున్నారని, ఈ సమస్యను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీజేపీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. మంగళవారం భారతీయ జనతా పార్టీ ఖమ్మం జిల్లా కార్యాలయంలో జరిగిన జిల్లా ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ అలసత్వానికి నిరసనగా, బాధిత రైతులకు అండగా ఈ నెల 10వ తేదీన ఖమ్మం కలెక్టరేట్ వద్ద ఉన్న ధర్నాచౌక్‌లో బీజేపీ ఆధ్వర్యంలో భారీ 'మహా ధర్నా' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ప్రకటించారు. రిజిస్ట్రేషన్ల చట్టం 22ఏ కింద అకారణంగా వేలాది ఎకరాలను నిషేధిత జాబితాలో చేర్చడం వల్ల సామాన్య ప్రజలు తమ పిల్లల పెళ్లిళ్లు, ఉన్నత చదువులు, వైద్య అవసరాల కోసం భూములు అమ్ముకోలేక కన్నీరుమున్నీరవుతున్నారని నెల్లూరి కోటేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వాల అనాలోచిత నిర్ణయాలను సరిదిద్దుతామని అధికారంలోకి వచ్చిన ప్రస్తుత ప్రభుత్వం సైతం ప్రజా సమస్యలను గాలికొదిలేసిందని ఆయన విమర్శించారు. ముఖ్యంగా ఖమ్మం జిల్లాకే చెందిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రెవెన్యూ శాఖను పర్యవేక్షిస్తున్నప్పటికీ, సొంత జిల్లాలోనూ, రాష్ట్ర వ్యాప్తంగానూ ఉన్న ఈ ప్రధాన సమస్యను పరిష్కరించడంలో ఏమాత్రం చిత్తశుద్ధి చూపకపోవడం దారుణమన్నారు. బాధితుల పక్షాన నిలబడలేని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి ఆ పదవిలో కొనసాగే నైతిక అర్హత లేదని, ఆయన తక్షణమే తన మంత్రి పదవికి రాజీనామా చేయాలని నెల్లూరి కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల సాధనలో భారతీయ జనతా పార్టీ ఎన్నటికీ వెనకడుగు వేయదని ఆయన స్పష్టం చేశారు. అవసరమైతే ప్రభుత్వ మెడలు వంచైనా సరే 22ఏ జాబితాలో అకారణంగా చేర్చిన భూములను తొలగింపజేసి తీరుతామని హెచ్చరించారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులతో పాటు.. 22ఏ చట్టం వల్ల నష్టపోయిన బాధితులు, రైతులు, సామాన్య ప్రజలు వేలాదిగా తరలివచ్చి ఈ మహా ధర్నాను విజయవంతం చేయాలని నెల్లూరి కోటేశ్వరరావు విజ్ఞప్తి చేశారు.



# సర్పంచుల గళం నొక్కే యత్నం..

## అశ్వాపురంలో 9 మంది బీఆర్ఎస్ సర్పంచుల ముందస్తు అరెస్టు

**అశ్వాపురం, సెప్టెంబర్ 9 (జనంసాక్షి):** గ్రామపంచాయతీలకు నిధులు విడుదల చేయాలని, సర్పంచుల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన 'చలో హైదరాబాద్' కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు ప్రభుత్వం పోలీసులను ప్రయోగించిందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. హైదరాబాద్‌కు వెళ్లేందుకు సిద్ధమైన అశ్వాపురం మండలానికి చెందిన బీఆర్ఎస్ సర్పంచులు, నాయకులను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకోవడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. తెల్లవారుజాము నుంచే పోలీసులు నిఘా పెట్టి తొమ్మిది మంది బీఆర్ఎస్ సర్పంచులు, నాయకులను పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు బీఆర్ఎస్ శ్రేణులు తెలిపారు. సర్పంచుల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం, వారి ఉద్యమాన్ని అడ్డుకోవడం ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడమేనని విమర్శించారు. గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు సర్పంచులు అప్పులు చేసి పనులు పూర్తి చేసినప్పటికీ పెండింగ్ బిల్లులు చెల్లించకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. గ్రామపంచాయతీలకు నిధులు విడుదల చేయకుండా అభివృద్ధిని ఎలా కొనసాగిస్తారని ప్రశ్నించారు. అరెస్టులు, నిర్బంధాలతో సర్పంచుల ఉద్యమాన్ని అణచివేయలేరని, ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్ బిల్లులు, గ్రామపంచాయతీల నిధుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ముందస్తుగా అదుపులోకి తీసుకున్న వారిలో బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మర్రి మల్లారెడ్డి, మొండికుంట సర్పంచ్ మర్రి సంధ్య మల్లారెడ్డి, నెల్లిపాక సర్పంచ్ ముంద్రు రామకృష్ణ, ఆనందపురం సర్పంచ్ ముర్రం సమ్మయ్య, గొందిగూడెం సర్పంచ్ తాటి వెంకటలక్ష్మి, గొల్లగూడెం సర్పంచ్ కోంద్రు సమ్మయ్య, ఎలకలగూడెం సర్పంచ్ కలేటి నాగమణి, జగ్గారం సర్పంచ్ సున్నం తిరుపతమ్మ, చింతిర్యాల కాలనీ సర్పంచ్ కొరస అలివేలు, కల్యాణపురం సర్పంచ్ లకావత్ రామారావు ఉన్నారు.

# కరెంటు కోతలపై ప్రజల ఆందోళన

డీఈ జీవన్‌కుమార్ సూచించారు. అధికారికంగా విద్యుత్ కోతలకు సంబంధించి ఎలాంటి ప్రకటన లేదని పేర్కొన్నారు. విద్యుత్ సరఫరాకు సంబంధించిన సమస్యలు ఎదురైతే నేరుగా విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకువస్తే సమస్యను పరిశీలించి పరిష్కరిస్తామని తెలిపారు. విషయం పూర్తిగా తెలుసుకోకుండా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడం వల్ల ప్రజల్లో అనవసరమైన భయాందోళనలు ఏర్పడే అవకాశం ఉందని పేర్కొన్నారు.

**రైతులకు ఉచిత విద్యుత్ సరఫరా కొనసాగింపు:**

తెలంగాణ ప్రభుత్వం విద్యుత్ రంగంలో స్పష్టమైన విధానంతో ముందుకు సాగుతోందని అధికారులు తెలిపారు. వ్యవసాయ రంగానికి ఉచిత విద్యుత్ సరఫరా కొనసాగించడంతో పాటు, వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా విద్యుత్ సరఫరా చేసే విధంగా శాఖ చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. రైతులకు ఉచిత విద్యుత్ అందించడంతో పాటు అర్హులైన గృహ వినియోగదారులకు ప్రభుత్వ పథకాల ద్వారా జీరో బిల్లింగ్ వంటి సౌకర్యాలు కొనసాగుతున్నాయని తెలిపారు.

**ఒకవైపు ప్రజల ఆరోపణలు.. మరోవైపు శాఖ వివరణ:**

అశ్వాపురం మండలంలో రాత్రివేళల్లో తరచుగా విద్యుత్ సరఫరా నిలిచిపోతోందని ప్రజలు ఆరోపిస్తుండగా, సాధారణ విద్యుత్ కోతలు లేవని విద్యుత్ శాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వాస్తవ పరిస్థితిపై విద్యుత్ శాఖ మరింత స్పష్టత ఇవ్వడంతో పాటు, స్థానికంగా ఏర్పడుతున్న సాంకేతిక సమస్యలను వేగంగా పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజలకు నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించడమే లక్ష్యమని, విద్యుత్‌కు సంబంధించిన ఏ సమస్య ఉన్నా అధికారుల దృష్టికి తీసుకురావాలని డీఈ జీవన్‌కుమార్ సూచించారు.

### జాతీయ మెగా లోక్ అదాలత్ ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలి

### -సీఐ చరమంద రాజు

**హుజూర్ నగర్, సెప్టెంబర్ 9 (జనంసాక్షి):** ఈనెల 12న జరిగే జాతీయ లోక్ అదాలత్ ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని హుజూర్ నగర్ సీఐ జి. చరమందరాజు కోరారు. బుధవారం ఈ సందర్భంగా సీఐ చరమందరాజు మాట్లాడుతూ ఈ నెల 12 వ తేదీన జరగనున్న జాతీయ మెగా లోక్ అదాలత్ ఉన్నందున రాజీ పడదగిన కేసులలో, క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్ తగాదా కేసులు, ఆస్తి విభజన కేసులు, కుటుంబపరమైన కేసులు, డ్రంకన్ డ్రైవ్ కేసులు, మోటారు ట్రాన్స్పోర్ట్ రోడ్డు నిభందనలు ఉల్లంఘన కేసులు, వైవాహిక జీవితానికి సంబంధించిన కేసులు, బ్యాంకు రికవరీ, చెక్ బౌన్స్ ఇలా రాజిపడదగిన కేసుల్లో కక్షిదారులు రాజీ చేసుకోవచ్చునని తెలిపారు. రాజీయే రాజ మార్గమన్నారు. చిన్న చిన్న కేసులతో కక్షలు పెంచుకుని కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని వృదా చేసుకోవద్దన్నారు. న్యాయశాఖ ఇచ్చిన అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. జిల్లాలోని పోలీస్ అధికారులు, కోర్టు విధులు నిర్వహించే కానిస్టేబుల్ లు, ఇతర పోలీస్ సిబ్బంది రాజీ పడదగిన కేసులను గుర్తించి ఇరువర్గాల వారిని పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించి రాజీ పడేటట్లు అవగాహన కల్పించాలని సూచించారు. కావున ఎవరైనా తమ కేసులలో రాజీ కావాలి అనుకున్నవారు సంభందిత పోలీస్ అధికారులకు సంప్రదించాలని, లోక్ అదాలత్ ద్వారా బాధితులకు సత్వరమే న్యాయం జరుగుతుందన్నారు.

# కాళోజీ సాహిత్యం ఆచరణీయం

## కలెక్టర్ బి. చంద్రశేఖర్

గొప్ప సాహిత్య సంపదను అందించారని అన్నారు. ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరూ సన్మార్గంలో పయనించాలని పిలుపునిచ్చారు. కాళోజీ నారాయణరావుతో పాటు దాశరథి, సుమతి, వేమన వంటి మహాకవుల కవితలు మన జీవన గమనానికి మార్గదర్శకం గా నిలుస్తాయని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, శిక్షణ సహాయ కలెక్టర్ శ్రీకాంత్ రెడ్డి, డీఆర్ఓ దశరథ్, కలెక్టర్ కార్యాలయ ఏఓ మోతిలాల్, కలెక్టర్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొని కాళోజీ నారాయణరావుకు ఘనంగా నివాళు లర్పించారు.

# ఆరోగ్యంగా ఉంటేనే ప్రజలకు మెరుగైన సేవలు

## సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ

చేసుకొని ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని అన్నారు. పోలీస్ సిబ్బంది తమ ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని, క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. పోలీసుల సంక్షేమాన్ని గుర్తించి ముందుకొచ్చి ఉచితంగా నాణ్యమైన వైద్య సేవలు, సలహాలు అందించిన ఆర్వీ హాస్పిటల్, హెల్త్‌ఫై హాస్పటల్ వైద్య బృందానికి, సూర్యాపేట కెమిస్ట్స్ అండ్ డ్రగిస్ట్ పోలీస్ శాఖ తరపున ధన్యవాదాలు తెలిపారు. 580 మంది సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకుని పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి రవీందర్ రెడ్డి, డీఎస్పీ లు ప్రసన్న కుమార్, నరసింహ చారి, హెల్త్ ఫై హాస్పటల్ డాక్టర్ చలపతి రావు, ఆర్వీ హాస్పటల్ కార్డియాలజీ డాక్టర్ ప్రేమ్ కుమార్, గైనకాలజీ డాక్టర్ ప్రియాంక, ఆర్థోపెడిక డాక్టర్ భరత్, జనరల్ ఫిజిషియన్ డాక్టర్ సత్యం, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రామారావు, రిజర్వ్ ఇన్స్పెక్టర్ లు ప్రవీణ్ కుమార్, రాజశేఖర్, వెల్ఫర్ ఆర్ఎస్ఐ సాయిరాం, ఆర్ఎస్ఐలు సురేష్, అన్వర్, అఖిల్, పోలీసు సంఘం అధ్యక్షులు రమేష్, వైస్ ప్రెసిడెంట్ ఇన్స్పెక్టర్ రాజశేఖర్, సెక్రెటరీ కిరణ్, పలువురు పోలీస్ అధికారులు, సిబ్బంది, వైద్య బృందం, భవాని నర్సింగ్ హోం విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.



# ఖమ్మం జిల్లాలో ఇద్దరు విద్యార్థులు దుర్మరణం..!

మండలం కాకరవాయి. సమాచారం తెలుసుకున్న అతని తల్లిదండ్రులు హరీష్, ప్రియాంక ఇద్దరూ, వారి బంధువులు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి కి చేరుకొని విగత జీవిగా మారిన తమ ముద్దుల బిడ్డను చూసి హతాశు లయ్యారు. తమ ఆశల సౌధం కుప్ప కూలిందని గుండెలవిసేలా రోదిస్తుంటే అక్కడి వాతావరణం ఉద్వేగ భరితంగా మారింది. కాగా..! బాలుడు మరణ వార్త వివిధ ప్రసార మాధ్యమాల ద్వారా ఖమ్మం వ్యాప్తంగా వ్యాపించడంతో పలు విద్యార్థి సంఘాలు ప్రభుత్వాసుపత్రి వద్దకు చేరుకున్నాయి. గురుకుల పాఠశాలల్లో అనేక సమస్యలు తిష్ట వేశాయని, కనీస మౌలిక వసతులు కూడా కల్పించడంలో ప్రభుత్వం, అధికారులు విఫలమయ్యాయని ఆరోపిస్తూ ఆందోళనకు దిగాయి. ఇది ముమ్మాటికి అధికారుల నిర్లక్ష్య ఫలితమేనని, బాధితుడు కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశాయి. పరిస్థితి అదుపు తప్పకుండా ఖమ్మం టూ టౌన్ పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. బాలుడు తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన సీఐ బాలకృష్ణ దర్యాప్తు చేపట్టారు.

### ఉరి వేసుకుని ఇంటర్ మృతి..!

ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం గంగారం గ్రామంలో విషాదం చోటు చేసుకుంది. ఖమ్మం నగరంలోని ఒక ప్రైవేటు కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న తుమ్మ రెడ్డి శ్రీ చరణ్ రెడ్డి (19) ఉరి వే బలవన్మరణానికి పాల్పడ్డాడు. కళాశాల నుంచి మూడు రోజుల క్రితం విద్యార్థి గంగారం వెళ్లాడు. మంగళవారం అర్ధరాత్రి అందరూ నిద్రిస్తున్న సమయంలో తన ఇంట్లోనే ఉరి వేసుకున్నాడు. కొద్దిసేపటి తర్వాత గమనించిన తల్లిదండ్రులు వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు విద్యార్థి మరణానికి గల కారణాలను అతని తల్లిదండ్రులను అడిగారు. ఎవరికి ఏమి చెప్పలేదని రోదిస్తూ జవాబు ఇవ్వడంతో కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

# తాతా మధును ఎమ్మెల్సీ పదవి నుంచి భర్తరఫ్ చేయాలి

- దళిత వ్యతిరేక పార్టీ బీఆర్ఎస్
- ముఖ్యమంత్రి పదవిలో ఉన్నన్ని రోజులు అంబేద్కర్ జయంతులకు, వర్ధంతులకు నివాళులర్పించని దుర్మార్గుడు కేసీఆర్..
- జేబీపీ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్





**కొత్తగూడెం క్రైమ్, సెప్టెంబర్ 09(జనంసాక్షి):** అసెంబ్లీ స్పీకర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ శాసనమండలి సభ్యులు తాతా మధు,నవీన్ కుమార్ రెడ్డి లను వెంటనే పదవి నుంచి భర్తరఫ్ చేయాలని జైభీమ్ రావ్ భారత్ పార్టీ (జేబీపీ) స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్ డిమాండ్ చేశారు.బుధవారం పార్టీ శ్రేణులతో కలిసి పోస్ట్ ఆఫీస్ అంబేద్కర్ విగ్రహం ఎదుట ప్లకార్డులతో నిరసన తెలిపారు.ఈ సందర్భంగా కామేష్ మాట్లాడుతూ అసెంబ్లీ స్పీకర్ పై శాసన మండలి సభ్యులు మాట్లాడిన దానికి కెసిఆర్ క్షమాపణలు చెప్పాలన్నారు.బీఆర్ఎస్ పార్టీ దళిత వ్యతిరేక పార్టీ అని,కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న తొమ్మిదిన్నర ఏళ్లలో ఎన్నడూ అంబేద్కర్ జయంతులకు, వర్ధంతులకు నివాళులర్పించని దుర్మార్గుడు కేసీఆర్ అని విమర్శించారు.తాతా మధు వొళ్ళు మదమెక్కి స్పీకర్ పై మాట్లాడారని అదే స్థానంలో దళిత వర్గానికి చెందిన స్పీకర్ కాకుండా అగ్రవర్ణానికి చెందిన వ్యక్తి స్పీకర్ గా ఉండి ఉంటే ఇలానే మాట్లాడేవారా అని ప్రశ్నించారు.బీఆర్ఎస్ పార్టీ,జరిగిన ఘటనకు పశ్చాత్తాపం తెలపకుండా నిన్నటి రోజున దళితులు ఎర్రవల్లి ఫాం హౌజ్ వద్దకు వెళ్తే పసుపు నీళ్లతో శుద్ధి చేయడం,ఫాం హౌజ్ వద్ద దళితుల మీద దాడులు చేయడం అంటేనే దళితుల పట్ల వారి వైఖరి ఏంటో అర్థం అవుతుందని ఎద్దేవా చేశారు.దళితుడు స్పీకర్ గా ఉన్నందునే ఎక్కడ అధ్యక్షా అని మైక్ అడగాల్సి వస్తుందో అని ప్రజా సొమ్మును జీతంగా తీసుకుంటూ అసెంబ్లీకి రాని ప్రతిపక్ష నేత పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం కఠినంగా వ్యవహరించి స్పీకర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన శాసన మండలి సభ్యులను వెంటనే భర్తరఫ్ చేయాలని లేనియెడల పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మాలోత్ వీరు నాయక్,శంకర్,బాబా,రాంబాబు,కమలి,శారద తదితరులు పాల్గొన్నారు.



# నర్సాపురంలో రీ-సర్వేకు శ్రీకారం!

**భూముల హద్దుల గుర్తింపుతో రైతుల్లో హర్షం**
**ఏళ్లుగా పట్టాల కోసం ఎదురుచూపులు.. భూధార్‌పై ఆశలు**
**త్వరితగతిన సర్వే పూర్తి చేసి భూధార్ అందించాలని రైతుల విజ్ఞప్తి**

**అన్నపురెడ్డిపల్లి, సెప్టెంబర్ 9, జనంసాక్షి**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రీ-సర్వే ప్రక్రియలో భాగంగా అన్నపురెడ్డిపల్లి మండలంలోని నర్సాపురం (రాజపురం) రెవెన్యూ గ్రామం ఎంపికైంది. ఈ నేపథ్యంలో బుధవారం సర్వేయర్లు, రెవెన్యూ అధికారులు నర్సాపురం గ్రామాన్ని సందర్శించి భూముల హద్దులను గుర్తించే ప్రక్రియను ప్రారంభించారు. సర్వే, రెవెన్యూ అధికారులు పంట పొలాల్లోకి వచ్చి సర్వే చేపట్టడంతో గ్రామ రైతులు హర్షం వ్యక్తం చేశారు.నర్సాపురం రెవెన్యూ పరిధిలో ఎన్నో సంవత్సరాలుగా పలువురు రైతులకు భూములకు సంబంధించిన పట్టాలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా చిన్న, సన్నకారు రైతులు తమ భూములకు హక్కు పత్రాలు, భూధార్ కోసం ఏళ్లుగా ఎదురుచూస్తున్నారు.సర్వే ప్రక్రియను వేగవంతం చేసి, భూముల హద్దులు, హక్కులను స్పష్టంగా నమోదు చేసి అర్హులైన రైతులకు త్వరితగతిన భూధార్ అందించాలని రైతులు అధికారులను కోరుతున్నారు. రీ-సర్వే ప్రారంభం కావడం తమకు ఎంతో ఉపశమనాన్ని కలిగించిందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీటీ లక్ష్మినారాయణ, జీపీఓ బాలకృష్ణ, సర్వేయర్లు రాజేశ్వరి, పల్లవి, అజయ్, రైతులు భీమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, దుబాకుల రాము, బన్నె ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

# పెంచిన నిత్యావసర సరుకుల ధరలను తగ్గించాలి

## కలెక్టరేట్ ముందు ప్రగతిశీల మహిళా సంఘం ధర్నా




**ఖమ్మం కార్పొరేషన్, సెప్టెంబర్ 9 (జనంసాక్షి )**
ప్రగతిశీల మహిళా సంఘం ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పెంచిన నిత్యవసర సరుకులు తగ్గించాలని బుధవారం ఖమ్మం కలెక్టరేట్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించడం జరిగింది. ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ శిరోమణి పాల్గొని మాట్లాడుతూ, మోడీ ప్రభుత్వం నిత్యావ సర సరుకుల ధరలను అధికంగా పెంచి,సామాన్య, మధ్యతరగతి ప్రజల మీద భారాలు మోపినారని,ఇది దుర్మార్గమైన చర్యకు నిదర్శనమని ఆమె ప్రభుత్వాన్ని విమర్శించారు. ఇప్పటికే ప్రజలు పెట్రోల్, డీజిల్,వంటగ్యాస్ మరియు ఆరోగ్యానికి సంబంధించిన మందులు వైద్య ఖర్చులు, కరెంటు చార్జీలు, బట్టలు వంటివి పెంచి నారు. ఈ చార్జీల భారాలతో ప్రజలుఇబ్బందులు పడుతూ ఉంటే మోడీ ప్రభుత్వం సామాన్య, మధ్యతరగతి ప్రజలపై నిత్యావసర సరుకుల అయినటువంటి మంచి నూనె, పంచదార, పప్పులు, ఉల్లిగడ్డ ధరలను పెంచి సామాన్య మానవులు బ్రతకలేని పరిస్థితికి దిగజార్చార ని ఆమె విమర్శించారు. మోడీ ప్రభుత్వం కార్పొరేట్ వర్గాల ప్రయోజనాలను నెరవేర్చడం కోసం పని చేస్తోందని మరియు ఎన్నికల సమయంలో ప్రజలకు అనేక వాగ్దానాలు చేసి నేరవేర్చకుండా తిరిగి ప్రజల మీద భారాలు వేయటం అవకాశవాదం,ద్వంద్వ ప్రమాణాలకు నిదర్శనమని ఆమె ప్రభుత్వం ని విమర్శించారు.ప్రధాని మోడీ ప్రభుత్వం అంబానీ, అదా ని లాంటి కార్పొరేటు బహుళ జాతి కంపెనీల ప్రయోజనాలు కాపాడటం కోసం పనిచేస్తున్నారు, పెంచిన నిత్యావసర సరుకుల ధరలను తగ్గించకుంటే ప్రజల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని, మరియు 14 రకాల నిత్యావసర సరుకులను ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రజలకు అందించాలని ఆమె మోడీ ప్రభుత్వాన్ని కోరారు..అలాగే ప్రజల కొనుగోలు శక్తికి అనుకూలంగా ధరలను నిర్దేశించాలి అని ఆమె ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనియెడల భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని ఆమె ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఖమ్మం కలెక్టర్ కార్యాలయం వద్ద మోడీ ప్రభుత్వం పెంచిన అధిక ధరలను తగ్గించాలని నిరసిస్తూ

ప్రగతిశీల మహిళా సంఘం ఆధ్వర్యంలోవినూత్న నిరసన కార్యక్రమం. మరియు ర్యాలీ చేయడం జరిగింది. కార్యక్రమంలో ప్రగతిశీల మహిళా సంఘం ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షురాలు టి.ఝాన్సీ, జిల్లా సహాయ కార్యదర్శి ప్రతాపనేని శోభ, జిల్లా నాయకులు గోగినపల్లి సరోజిని, పరిమిల, అనసూయ, సుగుణ, సునీత,సీత, నిర్మల, పుల్లమ్మ, మరియమ్మ, రమణ తదితరులు పాల్గొన్నారు.

## కేసీఆర్‌పై వ్యాఖ్యలపై బీఆర్ఎస్ నాయకుల ఫిర్యాదు

**బూర్గంపహాడ్ సెప్టెంబర్ 09 (జనంసాక్షి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై ప్రాణహాని కలిగించేలా వ్యాఖ్యలు చేశారంటూ కాంగ్రెస్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌పై, నేరాన్ని ప్రోత్సహించారంటూ సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ నాయకులు బూర్గంపహాడ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసీఆర్ చావును కోరుతూ వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు పోలీసులను కోరారు. ఈ అంశంపై అసెంబ్లీలో సమాధానం చెప్పకుండా బీఆర్ఎస్ నాయకులను అడ్డుకున్నారని కూడా వారు ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత, మాజీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జలగం జగదీష్, మాజీ టౌన్ అధ్యక్షుడు కొనకంచి శ్రీను, మేడం లక్ష్మీనారాయణరెడ్డి, దారం కృష్ణారెడ్డి, మేడగం శ్రీనివాస్‌రెడ్డి, చిన్నపరెడ్డి, చేతుల పెద్ద వీర్రాజు, బానోతు శ్రీను, వార్డు సభ్యులు నాగేశ్వరరావు, కోటయ్య,నాగయ్య, మాజీ గ్రామ కమిటీ నాయకులు సురేష్, బోరెం శీను, గుల్ మహమ్మద్, మాజీ వార్డు సభ్యురాలు కామిరెడ్డి పద్మ, మాజీ ఎంపీటీసీ దాసరి వెంకటరమణ, బండారి లక్ష్మీనారాయణ, మదమంచి రాజేశ్వరరావు, సాధిక్ భాష, ఇసంపల్లి వెంకటేశ్వర్లు, కేవీ రమణ, యారం వెంకట్‌రెడ్డి, నరేష్‌రెడ్డి, పంగి సురేష్ తదితర బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వినాయక నవరాత్రి ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో నిర్వహించాలి: డీఎస్పీ శివరాం రెడ్డి




**నల్లగొండ ప్రతినిధి, సెప్టెంబర్ 9,(జనం సాక్షి):** రానున్న వినాయక నవరాత్రి ఉత్సవాలను శాంతియుత, సోదరభావ వాతావరణంలో నిర్వహించేందుకు ప్రజలు, శాంతి సంఘ సభ్యులు, గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులు పోలీసు శాఖకు పూర్తి సహకారం అందించాలని నల్గొండ డీఎస్పీ శివరాం రెడ్డి కోరారు.వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా శాంతిభద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ నియంత్రణ, గణేష్ మండపాల భద్రత తదితర అంశాలపై శాంతి సంఘ సభ్యులు, గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా డీఎస్పీ శివరాం రెడ్డి మాట్లాడుతూ ప్రతి గణేష్ మండపాన్ని నిర్వాహకులు తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. మండపాల వద్ద విద్యుత్ షార్ట్‌సర్క్యూట్, అగ్ని ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, రాత్రి వేళల్లో కూడా భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు.ఊరేగింపుల్లో మద్యం సేవించి పాల్గొనడం, మద్యం సేవించి వాహనాలు నడపడం పూర్తిగా నివారించాలని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. యువత అత్యుత్సాహానికి లోనై ఇతరులకు ఇబ్బంది కలిగించే విధంగా వ్యవహరించవద్దని సూచించారు.సోషల్ మీడియాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నామని, వదంతులు, ఫేక్ న్యూస్, రెచ్చగొట్టే పోస్టులు, అభ్యంతరకర వీడియోలు, ఇతరుల మనోభావాలను దెబ్బతీసే కంటెంట్‌ను ప్రచారం చేయవద్దని డీఎస్పీ తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.నిమజ్జనం రోజున ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ప్రత్యేక చర్యలు చేపడతామని, అవసరమైన చోట ట్రాఫిక్ మళ్లింపులు, బారికేడింగ్, పార్కింగ్ ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. వాహనదారులు పోలీసుల సూచనలు పాటించి సహకరించాలని కోరారు.గణేష్ విగ్రహాల ప్రతిష్ఠ, ఊరేగింపు, నిమజ్జనం సమయంలో పోలీసు శాఖ సూచనలు, నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని పేర్కొన్నారు. డీజేలు, సౌండ్ సిస్టమ్‌ల వినియోగంలో నిబంధనలు ఉల్లంఘించరాదని, ఇతరుల మనోభావాలను దెబ్బతీసే విధంగా ఎలాంటి నినాదాలు, వ్యాఖ్యలు, కార్యక్రమాలు నిర్వహించవద్దని స్పష్టం చేశారు.ప్రతి ఒక్కరి సహకారంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా వినాయక నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంతంగా విజయవంతంగా నిర్వహించుకోవాలని డీఎస్పీ శివరాం రెడ్డి కోరారు.ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ రమేష్, ఆర్‌డీఓ అశోక్, ఎస్బీ డీఎస్పీ మల్లారెడ్డి, గ్రంథాలయ చైర్మన్ హఫీజ్ ఖాన్, డిప్యూటీ మేయర్ అమేర్, శాంతి సంఘ సభ్యులు గోలి మధుసూదన్ రెడ్డి, వేరెల్లి చంద్రశేఖర్, కర్నాటి యాదగిరి, గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులు, సీఐలు రాజశేఖర్ రెడ్డి, ఆదిరెడ్డి, ఎస్ఐలు సైదాబాబు, శివకుమార్, ఇతర పోలీసు అధికారులు, వివిధ వర్గాల ప్రతినిధులు పాల్గొన్నారు.



# చండూరులో రోడ్డుపైనే మృత్యుపాశాలుగా విద్యుత్ స్తంభాలు



- విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంపై ప్రజల ఆగ్రహం..
- చిన్నపాటి ఏమరుపాటు. కూడా తీవ్ర ప్రాణనష్టానికి దారితీసే అవకాశం ఉన్నా..
- యంత్రాంగంలో కదలిక లేక పోవడం పై విమర్శలు..

**చండూరు, సెప్టెంబర్ 9 (జనంసాక్షి)**

చండూరు మున్సిపాలిటీ పరిధిలో అంతర్గత డ్రైనేజీ నిర్మాణాలు, రోడ్డు విస్తరణ పనులు పూర్తయి నెలలు గడుస్తున్నా, రహదారుల మధ్యలో ఉన్న ప్రమాదకర విద్యుత్ స్తంభాలను తొలగించడంలో విద్యుత్ శాఖ అధికారులు ఘోర వైఫల్యం ప్రదర్శిస్తున్నారు. విస్తరణ తర్వాత రోడ్లు విశాలంగా మారినప్పటికీ, రోడ్డుపై దర్శనమిస్తున్న కరెంటు స్తంభాలు వాహన దారులకు, స్థానిక ప్రజలకు మృత్యుపాశాలుగా మారాయి. ఇంత జరుగుతున్నా అధికారులకు ఇవి కనిపించడం లేదా..? లేక ప్రజల ప్రాణాలంటే అంత చులకనా.. అంటూ.. స్థానికులు తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు.మున్సిపాలిటీలో ప్రధాన కూడళ్లు, అంతర్గత వీధుల్లో చేపట్టిన రోడ్డు విస్తరణ పనుల అనంతరం విద్యుత్ స్తంభాలను రోడ్డు పక్కకు మార్చాల్సి ఉంది. అయితే పనులు పూర్తయి నెలలు గడిచినా విద్యుత్ శాఖ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. రాత్రి వేళల్లో విద్యుత్ దీపాలు సరిగ్గా వెలగని సమయాల్లో, మలుపుల వద్ద రోడ్డు మధ్యలో ఉన్న ఈ స్తంభాలను గమనించక పలువురు వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. చిన్నపాటి ఏమరుపాటు కూడా తీవ్ర ప్రాణనష్టానికి దారితీసే అవకాశం ఉన్నా యంత్రాంగంలో కదలిక లేకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం ప్రజాధనంతో జీతాలు చెల్లిస్తున్నది ప్రజల రక్షణ కోసమా లేక వారి ప్రాణాలతో చెలగాటమాడటానికా అని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తు న్నారు. ఓట్ల కోసం వచ్చే ప్రజా ప్రతినిధులు ఎన్నికల తర్వాత ప్రజల సమస్యలను గాలికొదిలేశారని చండూరు వాసులు వాపోతున్నారు. రోడ్ల మధ్యలో ఉన్న స్తంభాలను అంతర్గత డ్రైనేజీ అవతల వైపునకు తరలించేలా విద్యుత్, మున్సిపల్ అధికారులతో సమన్వయం చేసు కోవాల్సిన బాధ్యత స్థానిక ప్రజా ప్రతినిధులపై ఉంది. కానీ సమస్య తీవ్రత స్పష్టంగా కనిపిస్తున్నా.. ప్రజాప్రతినిధులు నోరు మెదపక పోవడం వారి నిర్లక్ష్య వైఖరికి అద్దం పడుతోందని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు తక్షణమే స్పందించి రోడ్డుపై ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించి, రోడ్డు పక్కన ఉన్న డ్రైనేజీ అవతలి వైపునకు తరలించాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అధికారులు ఇకనైనా నిర్లక్ష్య ధోరణి వీడి సమస్యను పరిష్కరించకపోతే, ఏదైనా ప్రాణనష్టం జరిగితే అందుకు అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని మున్సిపల్ ప్రజలు హెచ్చరిస్తున్నారు.

## బస్సుల సమయపాలనపై ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి

**భూదాన్ పోచంపల్లి, సెప్టెంబర్ 9 (జనంసాక్షి):**

పోచంపల్లి నుంచి ఉదయం 7 గంటలకు నూతన బస్సు సర్వీసును ప్రారంభించినందుకు దిల్‌సుఖ్‌నగర్ డిపో మేనేజర్, సిబ్బందికి విద్యార్థులు, ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని దిల్‌సుఖ్‌నగర్ నుంచి పోచంపల్లికి వచ్చే బస్సుల సమయాలను కూడా సర్దుబాటు చేయాలని కోరుతున్నారు. నూతన బస్సును ప్రతిరోజూ ఉదయం 7 గంటలకు కచ్చితంగా నడపడంతో పాటు ప్రతి బస్సుకు జీపీఎస్ ట్రాకింగ్ అందుబాటులో ఉంచాలని, భవిష్యత్తులో బస్సుల సమయపాలనపై ఎలాంటి సమస్యలు తలెత్త కుండా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, ప్రజలు కోరుతున్నారు.

## ఉప సర్పంచ్‌ల ముందస్తు అరెస్ట్




**మాడుగులపల్లి సెప్టెంబర్ 9 (జనంసాక్షి):**

ఉప సర్పంచ్‌ల హక్కులు, నిధుల సాధన కోసం హైదరాబాద్‌లో తలపెట్టిన అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి బయలుదేరుతున్న మాడుగులపల్లి మండల ఉప సర్పంచ్‌లను పోలీసులు బుధవారం ముందస్తుగా అరెస్ట్ చేశారు మండల కేంద్రంలో అసెంబ్లీ ముట్టడికి వెళ్తుండగా పోలీసులు అడ్డుకుని స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు అరెస్ట్ అయిన వారిలో ఉప సర్పంచ్‌లు మల్లేపల్లి వెంకన్న, బుర్రి సందీప్, సింగం పరమేష్‌లతో పాటు పలువురు ఇతర ఉప సర్పంచ్‌లు ఉన్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ రాజ్యాంగబద్ధమైన హక్కులు, నిధుల కోసం శాంతియుతంగా నిరసన తెలిపేందుకు వెళ్తుంటే ముందస్తు అరెస్టులు చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమన్నారు ప్రభుత్వం వెంటనే స్పందించి ఉప సర్పంచ్‌ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

## వల చిక్కుకుపోవడంతో కాలువలోకి దిగి.. ప్రమాదవశాత్తు మృతి



**మేళ్లచెరువు జనం సాక్షి**

మేళ్లచెరువు మండల కేంద్రంలో చేపలు పట్టేందుకు వెళ్లిన ఓ వ్యక్తి కాలువలో పడి ప్రమాదవశాత్తు మృతి చెందిన ఘటన మేళ్లచెరువు గ్రామ శివారులో మంగళవారం చోటుచేసుకుంది.ఎస్సై నవీన్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మేళ్లచెరువు గ్రామ శివారులోని ముత్యాల బ్రాంచ్ (ఎంబీసీ) కాలువలో మాలోల ర్యాంప్ వద్ద నీరు కిందికి ప్రవహించే ప్రాంతంలో భోగం యేసుబాబు (తండ్రి: మారయ్య), బక్కమంతులగూడెం, మఠంపల్లి మండలం, స్వగ్రామం సత్తెనపల్లి పట్టణం, పల్నాడు జిల్లా, తన బంధువులు ఏడుకొండలు, ప్రవీణ్‌లతో కలిసి చేపలు పట్టేందుకు వెళ్లాడు.ఈ క్రమంలో చేపలు పట్టేందుకు విసిరిన వల కాలువలో చిక్కుకుపోవడంతో దాన్ని బయటకు తీసేందుకు యేసుబాబు కాలువలోకి దిగాడు. ప్రమాదవశాత్తు కాలు జారి నీటిలో పడిపోయి మృతి చెందాడు.ఘటనపై మృతుడి భార్య పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం హుజూర్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

## బీఆర్ఎస్ పార్టీ నాయకుల ముందస్తు అరెస్ట్

**చింతలపాలెం(జనంసాక్షి)**



హైదరాబాద్‌లోని అసెంబ్లీ ఆవరణలో బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలు,మాజీ మంత్రులు కేటీఆర్,హరీశ్‌రావు,జగదీశ్ రెడ్డితో పాటు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలపై జరిగిన దాడిని నిరసిస్తూ హైదరాబాద్ అసెంబ్లీ ముట్టడికి వెళ్లేందుకు సిద్ధమైన చింతలపాలెం మండల బీఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షులు మోర్తాల వెంకటరెడ్డి, చింతలపాలెం గ్రామ సర్పంచ్ కందుల రామకోటిరెడ్డి లను పోలీసులు వాళ్ల నివాసాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యల్లో భాగంగా హౌస్ అరెస్ట్ చేశారు.



## వరద కాల్వ ద్వారా చివరి ఆయకట్టు వరకు నీరందించాలి

### మండల కేంద్రములో రైతుల రాస్తారోకో

### ఎమ్మార్వో కార్యాలయం ఎదుట ధర్నా అనంతరం వినతిపత్రం ఇవ్వటం

**మాడుగుల పల్లి సెప్టెంబర్ 9 (జనంసాక్షి):**

వరద కాల్వ ద్వారా చివరి ఆయకట్టు వరకు నీటిని సరఫరా చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని రైతులు డిమాండ్ చేస్తూ తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి, డిప్యూటీ తహశీల్దార్ కు వినతిపత్రం అందజేసిన అనంతరం మండల కేంద్రములో పెద్ద ఎత్తున రాస్తారోకో నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరద కాల్వ ద్వారా ప్రభుత్వం కేవలం 200 క్యూసెక్కుల నీటిని మాత్రమే విడుదల చేయడం వల్ల చివరి ఆయకట్టు రైతులకు నీరు అందడం లేదన్నారు కాలువ సామర్థ్యం ప్రకారం 600 క్యూసెక్కుల నీటిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు ఆయకట్టు కింద ఉన్న చెరువులను కుంటలను తక్షణమే నింపాలని కోరారు అక్రమ తూములను అరికట్టాలని డిమాండ్ చేశారు అదేవిధంగా పెద్దదేవులపల్లి రిజర్వాయర్ పైన లిఫ్టులను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు ప్రభుత్వ అధికారులు ఈ విషయంపైన నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా వెంటనే స్పందించి 600 క్యూసెక్కుల నీటిని విడుదల చేసి చివరి ఆయకట్టు వరకు నీరు అందేలా చేసి రైతాంగాన్ని ఆదుకునేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని లేని యెడల సంబంధిత అధికారుల కార్యాలయాలు ముట్టడిస్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు దేవిరెడ్డి అశోక్ రెడ్డి,యువజన సంఘం నాయకులు పుల్లెంల శ్రీకర్,పతాని శ్రీను,ఎలిజాల రమేష్, గవ్వ రవి,దేవి రెడ్డి మల్లా రెడ్డి,నారాయణ రెడ్డి శంకర్,కట్ట వెంకట్ రెడ్డి,పిల్లుట్ల బక్కయ్య,సందీప్,రవి,సంపత్,నరేష్,కొండ నాగరాజు,సంజీవ రెడ్డి, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎర్ర బోయినపల్లి లో పోషకాహార మాసో త్సవాలు

**కల్లూరు సెప్టెంబర్ 09 (జనంసాక్షి)**

కల్లూరు మండల పరిధిలోని ఎర్రబోయినపల్లి గ్రామంలో పోషకాహార మాసోత్సవాలు కల్లూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కల్లూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారిని నిర్మల జ్యోతి మాట్లాడుతూ గర్భిణీలు ,బాలింతలు, ఆరు సంవత్సరాలు పిల్లలు అందరూ కూడా పౌష్టికాహారం క్రమంతప్పకుండా తినాలని సూచించారు. ఆహారంలో వైవిధ్యం బ్యాలెన్స్ డైట్ గురించి వివరించారు .రక్తహీనత నివారణ చర్యల గురించి వెయ్యి రోజుల ప్రాముఖ్యత గురించి తల్లులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చిన్నారులకు అక్షరభ్యాసాలు ,అన్న ప్రాసనాలు, గర్భిణీ స్త్రీలకు శ్రీమంతాలు సామాజిక వేడుకలు నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పొట్రు శ్రీనివాసరావు, ఏఎన్ఎం పద్మ, జిపిఓ రాంబాయి, పంచాయతీ సెక్రటరీ సైదులు సెక్టార్ సూపర్వైజర్ సుజాత అంగన్వాడి టీచర్లు యశోద విజయలక్ష్మి ఆదిలక్ష్మి సుమలత ఆశాలు తల్లులు పిల్లలు పాల్గొన్నారు.





## ఓటర్ల జాబితాలో పేరు లేదా? మరో అవకాశం!

**- మొరంపల్లి బంజరలో ఓటర్ల సవరణ కార్యక్రమం**

**బూర్గంపహాడ్ సెప్టెంబర్ 09 (జనంసాక్షి)**

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణలో భాగంగా మొరంపల్లి బంజరలో ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం కొనసాగుతోంది. గతంలో దరఖాస్తు చేసుకున్నప్పటికీ జాబితాలో పేరు నమోదు కాని అర్హులకు మరోసారి అవకాశం కల్పించారు. అధికారుల సూచన: అర్హులైన ప్రతి పౌరుడు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఓటర్ల జాబితాలో పేరు ఉందో లేదో తప్పనిసరిగా పరిశీలించుకోవాలని అధికారులు సూచించారు. పేరు లేకపోతే వెంటనే సంబంధిత బీఎల్ఓను సంప్రదించి అవసరమైన ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పేరులో తప్పులు, చిరునామా లేదా ఇతర వివరాల్లో మార్పులు ఉంటే వాటిని కూడా సరిచేసుకోవచ్చని పేర్కొన్నారు. ఓటర్లు చేయాల్సిన చర్య: ప్రతి ఓటరు ముందుగా తమ పేరు ఓటర్ల జాబితాలో ఉందో లేదో తనిఖీ చేసుకోవాలి. పేరు కనిపించకపోతే ఆలస్యం చేయకుండా బీఎల్ఓను సంప్రదించి నమోదు కోసం దరఖాస్తు చేసుకోవాలి. వివరాల్లో తప్పులుంటే సవరణ దరఖాస్తు సమర్పించాలి.కార్యక్రమాన్ని ఎంపీడీఓ జమాలా రెడ్డి పరిశీలించి, వచ్చిన దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిశీలించి ఎలాంటి లోపాలు లేకుండా ప్రక్రియ పూర్తి చేయాలని బీఎల్ఓలకు సూచించారు.

## కాలోజి ఆశయాలు విద్యార్థులకు స్ఫూర్తి

**వాగొడ్డు తండా పాఠశాలలో ఘనంగా తెలంగాణ భాషా దినోత్సవం**

**టేకులపల్లి, సెప్టెంబర్ 9 (జనంసాక్షి):**



మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వాగొడ్డు తండాలో తెలంగాణ ప్రజాకవి కాలోజి నారాయణరావు జయంతి సందర్భంగా తెలంగాణ భాషా దినోత్స వాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాలోజి నారాయణరావు చిత్రపటానికి పూలమా లలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్ర మంలో పాఠశాల ఉపాధ్యాయుడు, తెలంగాణ రాష్ట్ర దివ్యాంగ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బానోతు లక్ష్మ నాయక్ మాట్లాడు తూ కాలోజి నారాయణరావు జీవితం, సాహిత్య సేవలు, తెలంగాణ భాషా సంస్కృతి పరిరక్షణలో ఆయన చేసిన కృషి గురించి విద్యార్థులకు వివరించారు.

## కాళోజీ ఆశయాలు యువతకు స్ఫూర్తిదాయకం

**- బూర్గంపహాడ్ కళాశాలలో తెలంగాణ భాషా దినోత్సవ వేడుకలు**

**బూర్గంపహాడ్ సెప్టెంబర్ 09 (జనంసాక్షి)**




భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండలం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ జి చీన్యా అధ్యక్షతన ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి, తెలంగాణ భాషా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ జి. చీన్యా మాట్లాడుతూ "అన్యాయాన్ని ఎదిరించినోడు నాకు ఆరాధ్యుడు" అని చాటి చెప్పిన కాళోజీ ప్రతి విద్యార్థికి ఆదర్శమూర్తి అన్నారు. తన అక్షరాలతో ప్రజా సమస్యలపై చైతన్యం రగిలించిన ప్రజాకవిగా కాళోజీ సేవలను కొనియాడారు.తెలుగు అధ్యాపకులు సిహెచ్ నాగేశ్వరరావు మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలన, రజాకార్ల అరాచకాలకు వ్యతిరేకంగా కాళోజీ తన కలంతో పోరాడారని తెలిపారు. తెలంగాణ భాష, యాస, సంస్కృతికి ఆయన రచనలు విశిష్ట గుర్తింపు తెచ్చాయని పేర్కొన్నారు.ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ జి. శ్రీనివాస్ మాట్లాడుతూ కాళోజీ సాహిత్యం నేటి యువతలో సామాజిక చైతన్యానికి స్ఫూర్తినిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## పోషకాహార లోపాన్ని నివారించేందుకు సమతుల్య ఆహారం తీసుకోవాలి

**- జిల్లా మహిళా సంక్షేమ అభివృద్ధి అధికారి ఏ.ప్రమీల**

**కామేపల్లి,సెప్టెంబర్ 9 (జనం సాక్షి):**



గర్భిణీలు, బాలింతలు చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని నివారించేందుకు సమతుల్య ఆహారం తీసుకోవడం ఎంతో అవసరమని జిల్లా మహిళా సంక్షేమ అభివృద్ధి అధికారి ఏ ప్రమీల అన్నారు. బుధవారం మండలంలోని కొత్త లింగాల1 అంగన్వాడి కేంద్రంలో పోషణ మాసం ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా మహిళా సంక్షేమ అభివృద్ధి అధికారి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పోషకాహార కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని తల్లులకు సూచించారు.పిల్లల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు పౌష్టికాహారం,పరిశుభ్రత,వ్యక్తిగత ఆరోగ్యంపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని విజ్ఞప్తి చేశారు.కామేపల్లి ప్రాజెక్ట్ సిడిపిఓ ఉమ మాట్లాడుతూ సెప్టెంబర్ 8 నుండి అక్టోబర్ 8 వరకు ఈ పోషణ మాసం కార్యక్రమాలను ప్రతి అంగన్వాడి. గ్రామాల తో పాటు మండల స్థాయిలో జరిపి ప్రజల్లో పోషకాహార ప్రాధాన్యతను వివరించాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాల్లో అందిస్తున్న పోషకాహారాన్ని గురించి అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని చెప్పారు.ఈ అంగన్వాడీ కేంద్రంలో ఉన్న న్యూట్రీ గార్డెన్ ను చూసి అన్ని అంగన్వాడీలల ఇదేవిధంగా గార్డెన్ ను అభివృద్ధి చేసుకుని వాటిలో పండించే మందులు లేని ఆకుకూరలు కూరగాయలు సెంటర్ లో వండే వంటల్లో వాడుకోవాలని సూచించారు. అంగన్వాడి కేంద్రంలో పోషకాహార ప్రాముఖ్యతను తెలియజేస్తూ వివిధ రకాల ఆకుకూరలు, పండ్లు, కూరగాయలు, చిరు ధాన్యాలు,పోషక పదార్థాలను ప్రదర్శించారు.కార్యక్రమంలో సూపర్వైజర్ బి.వరలక్ష్మి,స్కూల్ హెడ్మాస్టర్ డి. మల్లిక,టీచర్ శ్రీదేవి, డాక్టర్ రిషిత,హెల్త్ సూపర్వైజర్ శ్రీనివాస్ రావు,ఏ ఎన్ ఎం ముంతాజ్,అంగన్‌వాడీ టీచర్లు, ఆయలు తల్లులు, పిల్లలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## టీబీ నిర్మూలనకు ఉచిత ఎక్స్‌రే పరీక్షలు

**అబ్బుగూడెంలో 66 మందికి పరీక్షలు..**

**ఆరుగురిలో టీబీ అనుమానిత లక్షణాలు**

**అన్నపురెడ్డిపల్లి, సెప్టెంబర్ 9, జనంసాక్షి**

దేశాన్ని క్షయ రహితంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన టీబీ ముక్త్ భారత్ అభియాన్ లో భాగంగా అబ్బుగూడెం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కురం రాము శిబిరాన్ని ప్రారంభించారు.ఎర్రగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ నాజనీన్ తబస్సుమ్ పర్యవేక్షణలో అత్యాధునిక డిజిటల్ మొబైల్ ఎక్స్‌రే వాహనం ద్వారా గ్రామస్థులకు ఉచితంగా ఛాతీ ఎక్స్‌రే పరీక్షలు నిర్వహించారు. మొత్తం 66 మందికి పరీక్షలు చేయగా వారిలో 6 మందిలో టీబీ అనుమానిత లక్షణాలు ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. అనుమానితులకు తదుపరి కళ్లె (స్ఫుటం) రక్త పరీక్షలు నిర్వహించి, వ్యాధి నిర్ధారణ అయితే ఉచితంగా మందులు అందించనున్నట్లు వైద్య సిబ్బంది తెలిపారు.ఈ సందర్భంగా డాక్టర్ నాజనీన్ తబస్సుమ్ మాట్లాడుతూ రెండు వారాలకు మించి తగ్గని దగ్గు, సాయంత్రం వేళల్లో జ్వరం, ఆకలి మందగించి బరువు తగ్గడం, రాత్రివేళ చెమటలు పట్టడం, కళ్లెలో రక్తం పడటం వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. ఇలాంటి లక్షణాలు ఉన్నవారు వెంటనే సమీప ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు చేయించుకోవాలని కోరారు. టీబీ బాధితులకు పౌష్టికాహారం కోసం నిక్షయ్ పోర్టల్ ద్వారా నెలకు రూ.1,000 ఆర్థిక సాయం నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నట్లు తెలిపారు.

**పెద్దిరెడ్డిగూడెంలో 11న శిబిరం**

అన్నపురెడ్డిపల్లి మండలంలోని పెద్దిరెడ్డిగూడెం గ్రామంలో ఈ నెల 11న మొబైల్ ఎక్స్‌రే శిబిరం నిర్వహించనున్నట్లు వైద్య సిబ్బంది తెలిపారు. గ్రామ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని టీబీ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని కోరారు.

కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ప్రకాశరావు, గ్రామ కార్యదర్శి ఇబ్రహీం, టీబీ సూపర్‌వైజర్ వెంకట్, ఎక్స్‌రే టెక్నీషియన్ సాయికృష్ణ, ఏఎన్ఎం జయలక్ష్మి, ఆశా కార్యకర్తలు మణి, రాహేలు, సునీత, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌కు ఏదైనా జరిగితే ప్రభుత్వానిదే బాధ్యత.

## ఫామ్‌హౌస్ ఘటనపై సమగ్ర విచారణ జరపాలి: బీఆర్ఎస్

అశ్వాపురం, సెప్టెంబర్ 9 (జనంసాక్షి):

బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఫామ్‌హౌస్ వద్ద చోటుచేసుకున్నట్లు ఆరోపిస్తున్న అవాంఛనీయ ఘటనపై బీఆర్ఎస్ శ్రేణులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. కేసీఆర్ భద్రతకు ముప్పు కలిగించేలా ఎవరైనా వ్యవహరిస్తే ప్రభుత్వం వెంటనే స్పందించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేసీఆర్‌కు ఏదైనా హాని జరిగితే అందుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.ఫామ్‌హౌస్‌పై దాడికి యత్నించడం సాధారణ ఘటన కాదని, దీని వెనుక రాజకీయ కుట్ర ఉందనే అనుమానాలు ఉన్నాయని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. ఈ ఘటనపై బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్ ఆధ్వర్యంలో బుధవారం అశ్వాపురం పోలీస్‌స్టేషన్‌లో లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు. ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపి వాస్తవాలను ప్రజల ముందుంచాలని కోరారు.కేసీఆర్‌ను రాజకీయంగా ఎదుర్కోలేకనే ఆయనపై ఒత్తిడి, భయభ్రాంతులకు గురిచేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఫామ్‌హౌస్ ఘటనపై బాధ్యులను గుర్తించి వెంటనే చర్యలు తీసుకోవడంతో పాటు, కేసీఆర్ భద్రతను మరింత పెంచాలని డిమాండ్ చేశారు.ఈ ఘటనకు సంబంధించి ఈర్లపల్లి శంకర్ తీరుపై బీఆర్ఎస్ నాయకులు అసంతృప్తి వ్యక్తం చేస్తూ, నైతిక బాధ్యత వహించి తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్ష నాయకుల భద్రత విషయంలో ప్రభుత్వం, అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.కేసీఆర్ భద్రతపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని, ఫామ్‌హౌస్ ఘటనపై నిష్పక్షపాతంగా విచారణ జరపాలని కోరారు. లేనిపక్షంలో ప్రజాస్వామ్య పద్ధతిలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని బీఆర్ఎస్ నాయకులు హెచ్చ రించారు.ఈ కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్య దర్శి మర్రి మల్లారెడ్డి, మాజీ ఎంపీపీ కొల్లుమల్లారెడ్డి, సీనియర్ నాయకులు ఈదర సత్యనారాయణ, వెన్న అశోక్‌కుమార్, చుంచు రామ్మూర్తి, వీరభద్రం, సత్యనారాయణరెడ్డి, భూక్యా చందు లాల్, సర్పంచులు, ఉప సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

## కేసీఆర్‌పై 'మరణ' వ్యాఖ్యలు

- **షాద్‌నగర్ ఎమ్మెల్యే తీరుపై బీఆర్ఎస్ భగ్గు**
- **హాని చేయడానికి ప్రేరేపించేలా వ్యాఖ్యలు చేశారంటూ ఆరోపణ**
- **ఎమ్మెల్యేపై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్**
- **కేసీఆర్ భద్రతను తక్షణమే సమీక్షించాలని కోరిన ఖమ్మం బీఆర్ఎస్ నేతలు**

**ఖమ్మం, (జనంసాక్షి) :**

బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావుపై షాద్‌నగర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే శంకరయ్య చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో కలకలం రేపుతున్నాయని బీఆర్ఎస్ ఖమ్మం నాయకులు అన్నారు. కేసీఆర్ మరణాన్ని కోరేలా, ఆయనకు హాని కలిగించే విధంగా ప్రేరేపించే ధోరణిలో వ్యాఖ్యలు చేయడం తీవ్ర అభ్యంతరకరమని మండిపడ్డారు. సెప్టెంబర్ 8న ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియా, ఆర్ టి వి లో ప్రసారం ద్వారా విస్తృతంగా ప్రచారంలోకి వచ్చాయని తెలిపారు. రాజకీయ ప్రత్యర్థిపై విమర్శలు చేయడం ప్రజాస్వామ్యంలో సహజమేనని, అయితే వ్యక్తిగత దూషణలు, బెదిరింపులు, హింసకు దారితీసేలా వ్యాఖ్యలు చేయడం మాత్రం తీవ్రంగా పరిగణించాల్సిన అంశమని పేర్కొన్నారు. ప్రతిపక్ష నేతగా ఉన్న కేసీఆర్‌ను లక్ష్యంగా చేసుకుని చేసిన వ్యాఖ్యలపై ప్రభుత్వం మౌనం వహించకూడదని బీఆర్ఎస్ నేతలు డిమాండ్ చేశారు. ఒక ప్రజాప్రతినిధి చేసిన వ్యాఖ్యలు ప్రజల్లో ఉద్రిక్తతలకు, అనుచరుల మధ్య ఘర్షణలకు దారితీసే అవకాశం ఉన్నందున ప్రభుత్వం తక్షణమే స్పందించాలని కోరారు. ఎమ్మెల్యే శంకరయ్య చేసినట్లు పేర్కొంటున్న వ్యాఖ్యలపై సమగ్ర దర్యాప్తు జరిపి, భారతీయ న్యాయ సంహితలోని నిబంధనల మేరకు కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. వ్యాఖ్యల వెనుక ఉద్దేశం ఏమిటి, వాటి వల్ల ఎలాంటి పరిణామాలకు అవకాశం ఉందన్న అంశాలపైనా దర్యాప్తు చేయాలని కోరారు. ఈ వ్యవహారంలో మరెవరైనా ప్రోత్సహించినా, సహకరించినా వారి పాత్రను కూడా విచారించాలని అన్నారు. ఈ వ్యాఖ్యల నిపథ్యంలో కేసీఆర్ భద్రతను ప్రభుత్వం తక్షణమే సమీక్షించాలని బీఆర్ఎస్ ఖమ్మం నాయకులు డిమాండ్ చేశారు. ఆయనకు ఎలాంటి హాని జరగకుండా అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని కోరారు. రాజకీయ ప్రత్యర్థులపై విమర్శలకు ఒక పరిమితి ఉండాలని, ఆ పరిమితి దాటితే ప్రభుత్వం చట్టప్రకారం కఠినంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. వినతిపత్రం అందించిన వారిలో సుడా మాజీ చైర్మన్ బచ్చు విజయకుమార్, మాజీ కార్పొరేటర్లు కూరాకుల వలరాజు, నాగండ్ల కోటేశ్వరరావు, దండ జ్యోతి రెడ్డి అయ్యప్ప రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు బీరెడ్డి నాగచంద్రారెడ్డి, దేవభక్తుని కిషోర్ బాబు, కొనకంచి ప్రసాద్, కోలేటి రాధాకృష్ణ, జాబిశెట్టి శ్రీనివాసరావు, చిలకల వెంకట నరసయ్య, పొదిలి నాగరాజు, యాకూబ్ పాషా, మారగాని సుదర్శన్, వంగవీటి శ్రీనివాసరావు, చల్లగుండ్ల నరసింహారావు,తదితరులు పాల్గొన్నారు.



# అసెంబ్లీని రాజకీయాలకు వేదికగా మార్చొద్దు

- జనసేన ఉమ్మడి నల్లగొండ జిల్లా ఇంచార్జ్ మేకల సతీష్ రెడ్డి
- జనసేన పార్టీ జిల్లా నాయకులు ఏవి రావు ఆధ్వర్యంలో నిరసన



**సూర్యాపేట (జనంసాక్షి):** ప్రజా సమస్యలపై చర్చించి పరిష్కారాలు చూపాల్సిన శాసనసభను రాజకీయాలకు వేదికగా మార్చుకోవడం సరికాదని జనసేన ఉమ్మడి నల్లగొండ జిల్లా ఇంచార్జ్ మేకల సతీష్ రెడ్డి అన్నారు.బుధవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద జనసేన పార్టీ జిల్లా నాయకులు ఏవి రావు ఆధ్వర్యంలో ఫ్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మేకల సతీష్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ శాసనసభను కాంగ్రెస్,బీఆర్ఎస్ పార్టీలు రాజకీయ అడ్డాగా మార్చవద్దని అన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.పేదలకు ఇబ్బందిగా ఉన్న 22ఏ భూముల సమస్యను ప్రభుత్వం పరిష్కరించాలని అన్నారు.ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని పేర్కొన్నారు. రాష్ట్రంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు, విద్యుత్ కోతలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.సాగు, త్రాగు నీరు కోసం గ్రామాల్లో చెరువులు నింపకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని అన్నారు.తాగునీటి సమస్య పరిష్కారం కోసం వెంటనే చెరువులు నింపాలని కోరారు.వెయ్యి రోజుల సీఎం రేవంత్ రెడ్డి పాలనలో ఇచ్చిన హామీలు, ప్రజా సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఇకనైనా ప్రజా సమస్యలపై అసెంబ్లీలో చర్చించి పరిష్కార మార్గాలు చూపాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు అందె శ్రీనివాస్, జిలాని, శివసాయి, భూక్యా సైదులు, శంకర్ నాయక్, మొలుగూరి సైదులు, వెంకట్, రాయల సతీష్, వెంకన్న, పసుపులేటి రామారావు, కాసర్ల వినయ్, షేక్ నజీర్ పాషా, లింగా నాయక్, మారోజు తిరుమల చారి, దండు మధు, వేముల విజయ్, సాయి స్వరూప్, పేరెల్లి గణేష్ తదితరులు పాల్గొన్నారు.



# వార్డులో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు

- 1000 రోజుల ప్రజా పాలనలో అభివృద్ధి వెలుగులు
- మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్

**హుజూర్‌నగర్, సెప్టెంబర్ 9 (జనంసాక్షి):** మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సహకారంతో హుజూర్‌నగర్ మున్సిపాలిటీ 25వ వార్డులో రూ.5 లక్షల అంచనా వ్యయంతో విద్యుత్ స్తంభాలు, వీధి దీపాల పనులను మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్ ప్రారంభించారు. బుధవారం ఈ సందర్భంగా చైర్మన్ శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం 1000 రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా పనులు ప్రారంభించామని, మంత్రి చొరవతో హుజూర్‌నగర్‌లో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. నూతన లైన్లు, మిడిల్ పోల్స్ ఏర్పాటుతో చీకటి సమస్య తొలగి రాత్రివేళ ప్రజలు సురక్షితంగా సంచరించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏఈ రామ్ ప్రసాద్, 25వ వార్డు కౌన్సిలర్ కోతి సంపత్ రెడ్డి, కౌన్సిలర్లు సులువ నాగలక్ష్మి, చెనగాని సైదులు, జక్కుల మల్లయ్య, వల్లపుదాసు కృష్ణ, నందిగామ సైదులు, దగ్గుపాటి కవితబాబురావు, కోలా ఉదయభాను, సావిత్రి ప్రవీణ్, భద్రమ్మ, రమేష్, సుజాతచంటి, నాయకులు ఓర్స్ వెంకన్న, తోట ఉపేందర్, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# దళిత బిడ్డల పాదముద్రలను పసుపు నీళ్లతో కడిగిన కేసీఆర్

**- దళితులంటే అంత చిన్నచూపా?**

**-కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా నాయకులు నోముల ప్రవీణ్**



**రామన్నపేట, సెప్టెంబర్ 9 (జనంసాక్షి):** దళితులు నిరసన తెలిపిన స్థలాన్ని పసుపు నీళ్లతో కడగడం దళిత సమాజాన్ని అవమానించడమేనని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా నాయకులు నోముల ప్రవీణ్ తీవ్రంగా ఖండించారు. బుధ వారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశం లో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు చేసిన దళిత వ్యతిరేక వ్యాఖ్యలకు నిరసనగా, క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ దళిత సంఘాలు, కాంగ్రెస్ శ్రేణులు డప్పు చప్పులతో, ఆత్మగౌరవ నినాదాలతో ఎర్రవెల్లి ఫామ్ హౌస్ వైపు కదిలిన దళిత సంఘాల నాయకులను పోలీసులు వారిని అడ్డుకున్నా, డప్పులతో, నినాదాలతో తమ ఆవేదనను వినిపించారని, అయితే ఆ దళిత బిడ్డలు వెనుదిరిగిన వెంటనే, వారి పాదముద్రలు పడిన చోట పసుపు నీళ్లతో కడిగినట్లుగా వస్తున్న వీడియోలు, ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఇది నిజమైతే ఇంతకంటే దారుణం, ఇంతకంటే అవమానం మరొకటి ఉండదని మండిపడ్డారు. తెలంగాణ తెచ్చింది దళితులమే, కొట్లాడింది మేమే అని చెప్పుకునే కేసీఆర్, దళితులను ముఖ్యమంత్రిని చేస్తానని మాట ఇచ్చి, దళిత బంధు పేరుతో మోసం చేసి, ఇప్పుడు ఏకంగా దళితుల పాదముద్రలను పసుపు నీళ్లతో కడిగే స్థాయికి దిగజారాడా? అని ప్రశ్నించారు. ఇది కేవలం పసుపు నీళ్లతో కడగడం కాదు, తెలంగాణలోని 30 లక్షల దళిత కుటుంబాల ఆత్మగౌరవాన్ని కడిగేయడమేనని, దళితులంటే కేసీఆర్ కు ఎంత చిన్నచూపో ఈ ఘటనతో మరో సారి బయట పడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ ఘటనపై కేసీఆర్, కేటీఆర్ లు వెంటనే దళిత సమాజానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.



# మేరు కులస్థులకు అండగా ఉంటాం

**సూర్యాపేట (జనంసాక్షి):** మేరు సంఘం కులస్తులకు తాను అండగా నిలిచి, సంఘ భవన స్థలం కోసం సహకరిస్తానని రాష్ట్ర పర్యాటక శాఖ అభివృద్ధి మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు.బుధవారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో నూతనంగా ఎన్నికైన పట్టణ మేరు సంఘ అధ్యక్ష, కార్యదర్శులు సంఘ సభ్యులతో కలసి మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు నూతనంగా ఎన్నికైన కమిటీ సంఘ సమస్యల పరిష్కారం కోసం నిరంతరం శ్రమించాలని అన్నారు.అనంతరం కలెక్టరేట్ లో బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ కు పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందించారు.ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు మునగాల సతీష్ ,కార్యదర్శి కర్నె ఉపేందర్, కోశాధికారి తెంబరేణి కృష్ణ, రాష్ట్ర మేరు సంఘం మాజీ ఉపాధ్యక్షులు రేణుకుంట్ల నరేందర్,గట్ల సిద్ధప్ప, తెంబరేణి వీరేష్, కీర్తి వెంకటేశ్వర్లు, మేడిగ శ్రీనివాస్, ఎల్కాశెట్టి రాము, నిమ్మల వెంకటేశ్వర్లు, వాడపల్లి మురళి, గట్ల సువర్ణ, టెంబరేణి సరస్వతి, గట్ల వర్సమ్మ, మునగాల రమాదేవి, తెంబారిని దివ్య, దీకొండ మల్లేష్, దీకొండ శోభ, రామగిరి జ్యోతి, అదిమూల శ్రీనివాస్, అదిమూల మహాలక్ష్మి, మేడిగ మహేశ్వరీ, వాడపల్లి రాజేష్, వాడపల్లి దివ్య, రామగిరి శివసాయి తదితరులు పాల్గొన్నారు.



# ఆచార్యులగూడెంలో అంగన్వాడి నూతన భవనానికి శంకుస్థాపన

**200 గజాల స్థలాన్ని విరాళంగా ఇచ్చిన దాతలు.. మైలారిశెట్టి చిన్న యలమందయ్య, జానకమ్మ దంపతులను అభినందించిన గ్రామస్థులు**

**చిలుకూరు, సెప్టెంబర్ 09 (జనంసాక్షి):** మండలంలోని ఆచార్యులగూడెం గ్రామంలో నూతన అంగన్వాడీ భవన నిర్మాణానికి బుధవారం సర్పంచ్ బొడ్డుపల్లి లక్ష్మి బిక్షం, స్థలదాతలు మైలారిశెట్టి చిన్న యలమందయ్య, జానకమ్మ దంపతుల చేతుల మీదుగా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ అంగన్వాడీ భవన నిర్మాణానికి 200 గజాల స్థలాన్ని దానం చేసిన చిన్న యలమందయ్య, జానకమ్మ దంపతులను అభినందించారు. స్థల దానం ఆస్తి దానం మాత్రమే కాదని, ఎందరో చిన్నారుల భవిష్యత్తుకు వెలుగునిచ్చే మహాదానమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ నేమ్మాది వీరబాబు, వార్డు సభ్యులు అలవాల భాస్కర్, చింతరెడ్డి లక్ష్మారెడ్డి, వంగూరి కనకరత్నం సూర్యం, బొడ్డుపల్లి ధనలక్ష్మి, అంగన్వాడీ సూపర్‌వైజర్ పొన్నం ఉపేంద్ర, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు రాంబాబు, టీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు గట్టు వీరయ్య, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

# సామాన్యుడి రైలు కోసం సాగే పోరాటానికి సంపూర్ణ మద్దతు



**సూర్యాపేట (జనంసాక్షి):** సూర్యాపేటకు సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండే సాధారణ రైల్వే లైన్ సాధన కోసం జరుగుతున్న ప్రజా ఉద్యమానికి బీజేపీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. సూర్యాపేట రైల్వే సాధన సమితి ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి లక్ష పోస్ట్‌కార్డులు పంపేందుకు చేపట్టిన లక్ష పోస్ట్‌కార్డుల ఉద్యమ శిబిరాన్ని బీజేపీ నాయకులు సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ టీచర్స్ సెల్ రాష్ట్ర కోకన్వీనర్ తీకుళ్ల సాయిరెడ్డి మాట్లాడుతూ జిల్లా కేంద్రంగా ఉన్న సూర్యాపేటకు రైల్వే సౌకర్యం లేకపోవడం ఈ ప్రాంత ప్రజలకు తీరని లోటని అన్నారు.అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగపడే సాధారణ రైల్వే లైన్ సూర్యాపేటకు రావాల్సిన అవసరం ఉందన్నారు.సూర్యాపేటకు సాధారణ రైలుతో పాటు అవకాశాలు, సాధ్యాసాధ్యాలను పరిశీలించి మెట్రో రైలు సౌకర్యాన్ని కూడా కల్పించాలని ఆకాంక్షించారు.గతంలో కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన బుల్లెట్ రైలు మార్గంలో సూర్యాపేటకు అవకాశం ఉండగా, అనంతరం ఆ మార్గంలో మార్పులు ఎందుకు జరిగాయనే అంశంపై స్పష్టత రావాల్సిన అవసరం ఉందని అన్నారు.అనంతరం ప్రముఖ జాతీయవాది కుంట్ల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ సూర్యాపేట ప్రజల చిరకాల ఆకాంక్ష అయిన రైల్వే లైన్ సాకారం కావాలని కోరారు.బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు బండపల్లి పాండురంగాచారి మాట్లాడుతూ సూర్యాపేటకు రైల్వే లైన్ రావాలన్న డిమాండ్ న్యాయమైనదని పేర్కొన్నారు.బీజేపీ వన్ టౌన్ అధ్యక్షులు కందుల రమేష్ మాట్లాడుతూ సూర్యాపేటకు రైల్వే లైన్ వస్తే ప్రయాణ సౌకర్యం పెరగడమే కాకుండా వ్యాపార, వాణిజ్య, విద్య, ఉపాధి రంగాల్లో కూడా అభివృద్ధికి అవకాశం ఏర్పడుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు గజ్జెల వెంకటరెడ్డి, దాసరి వెంకటేశ్వర్లు, మిర్యాల రామ్మూర్తి, గుడిపాటి నాగేశ్వర్ రావు, బెలిదె అంజయ్య, రవి వర్మారెడ్డి, యామా దయాకర్, కోడి లింగయ్య, తన్నీరు వాసు, జెల్లి గణేష్, పిట్టల వెంకన్న, మామిడి మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

# సన్న వరికి బోనస్ కోసం ఆన్లైన్ నమోదుకు ఈ రోజే చివరి గడువు

**వ్యవసాయ అధికారి సైదా నాయక్**



**నూతనకల్ సెప్టెంబర్ 9(జనంసాక్షి)** సన్న వరి ధాన్యం బోనస్ పొందేందుకు రైతులు కొనుగోలు చేసిన సన్న వరి విత్తనాల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవడానికి 10-09-2026 చివరి తేదీ,కాబట్టి రైతు సోదరులందరూ ఈరోజు గురువారం సాయంత్రం లోపు మీరు కొనుగోలు చేసిన సన్న వరి విత్తనాల వివరాలను తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని కోరుతున్నాము.లేనియెడల బోనస్ రాలేదని రైతులు ఇబ్బంది పడవద్దని సన్న వరి వేసిన ప్రతి రైతు ఆన్లైన్ తప్పనిసరి చేసుకోవాలని ఏవో సైదా నాయక్ అన్నారు.

# అడవి తల్లి ఒడిలో అమృత హస్తం..

**○సేవారంగంలో ' నీలం పార్వతి' అరుదైన మైలురాయి**

**○నిరుపేదల కంటి వెలుగు, 'జీవన రక్ష' అవార్డు గ్రహీత.**

**○ఆసుపత్రి మెట్లపై పుట్టిన ఆశయం అడవి బిడ్డల జీవితాల్లో వెలుగులు.**

**○సొంత బాధం సేవగా మార్చి అవార్డుల శిఖరాన్నెక్కిన మణిదీపం..**

**మణుగూరు,సెప్టెంబర్ 09 (జనంసాక్షి):**
సరిహద్దుల్లో నిలబడి కాపాడేవాడే కాదు... సమాజపు అట్టడుగున ఆకలితో, అనారోగ్యంతో అలమటించే ప్రాణాన్ని నిలబెట్టేవాడు కూడా యోధుడే. అలాంటి ఒక అసాధారణ సేవా యోధురాలే మణుగూరుకు చెందిన నీలం పార్వతి. కార్పొరేట్ వైద్యం సామాన్యుడికి అందని ద్రాక్షగా మారిన ఈ రోజుల్లో, ఏజెన్సీ ప్రాంతాల్లోని నిరుపేదల పాలిట ఆమె పెన్నిధిగా మారారు. నీలం పార్వతి దాసరి లక్ష్మీ ముత్తయ్య దంపతుల గర్భాన జన్మించిన పార్వతి కరడుగట్టిన పేదరికాన్ని కళ్లారా చూసి, వారి కన్నీళ్లు తుడవడమే తన జీవిత ఆశయంగా మార్చుకున్నారు.

**కన్నీటి ప్రయాణం...కదిలించిన సంకల్పం:**
నీలం పార్వతి సేవా ప్రస్థానం వెనుక ఒక గుండెను పిండేసే కథ ఉంది. వారిది ఉమ్మడి కుటుంబం ఆమె తండ్రి ముత్తయ్య తీవ్రమైన అస్తమా వ్యాధితో శ్వాస తీసుకోలేక విలవిలలాడిపోతుంటే, మరోవైపు తల్లి లక్ష్మి గుండె సంబంధిత వ్యాధితో బాధపడే వారు. కన్నవారి ప్రాణాలను కాపాడుకోవడం కోసం ఆమె పడిన ఆరాటం అంతా ఇంతా కాదు. ఆసుపత్రులు అందుబాటులో లేక సరైన రవాణా లేక ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటు వారిని తీసుకుని పెద్ద ఆసుపత్రుల చుట్టూ, డాక్టర్ల చుట్టూ తిరగని రోజంటూ లేదు.ఆసుపత్రుల వరండాల్లో గంటల తరబడి వేచి చూస్తూ, కాళ్లు అరిగిపోయేలా తిరిగినా సరైన వైద్యం అందక, ఉన్న డబ్బులన్నీ కరిగిపోతుంటే ఆమె మనసు తల్లడిల్లిపోయింది. "నా కళ్ల ముందే నా తల్లిదండ్రులు ఇంత నరకం అనుభవిస్తుంటే, ఇక ఏ ఆధారం లేని ఏజెన్సీ ప్రాంతాల్లోని నిరుపేదల పరిస్థితి ఏమిటి? పైసా లేక వైద్యానికి దూరమవుతున్న ప్రాణాలెన్నో?" అనే ఘాటైన ప్రశ్న ఆమె అంతరాత్మను తొలచింది. అలసటను సైతం లెక్కచేయక, ఆ ఆసుపత్రి మెట్లపైనే ఆమె ఒక దృఢ నిశ్చయానికి వచ్చారు?"నేనే ఎందుకు ఈ వైద్య వృత్తిని చేపట్టకూడదు? నా లాంటి వాళ్ల నలుగురికి ఎందుకు ఉచితంగా సేవ చేయకూడదు?" అని నాడు విత్తిన ఆ ఆలోచనే, నేడు వేలాది మందికి నీడనిచ్చే మహావృక్షమైంది.మొదట ప్రభాకర్ వైద్యుని దగ్గర ఓనమాలు నేర్చుకోవడం మొదలు పెట్టింది. ఆ తర్వాత అనుభవం తో పాటు అక్షర జ్ఞానం ఉండాలని పై చదువుల కోసం పట్టణం వైపు నడిచింది.










**డిగ్రీలు కాదు... సేవ శ్వాసగా:**
అనుకున్నదే తడవుగా పట్టుదలతో చదివి బి.ఎస్సీ నర్సింగ్ పూర్తి చేశారు. పట్టణాల్లో ఏసీ గదుల్లో కూర్చుని లక్షలు సంపాదించే అవకాశాలను కాలదన్నారు. సమాజంలో ప్రాథమిక వైద్యానికి కూడా నోచుకోని మారుమూల గిరిజన ప్రాంతాల వైపు అడుగులు వేశారు. ఆర్.ఎమ్.పి వైద్యురాలిగా బాధ్యత స్వీకరించి, వైద్యం లేక ప్రాణాలు వదులుతున్న ఎందరో పేదలకు అమృత హస్తంలా మారారు. కరోనా సమయంలో ఎంతో తన ప్రాణాలు సైతం లెక్క చేయక వైద్య సేవలు అందించింది.

**చీకటి బతుకుల్లో కంటి వెలుగు:**
ఆమె సేవ కేవలం జ్వరం, జలుబులకే పరిమితం కాలేదు. అడవి బిడ్డల జీవితాల్లో గూడుకట్టుకున్న అంధకార చీకట్లను తరిమికొట్టేందుకు నడుం బిగించారు. కంటి చూపు కోల్పోయి, జీవితాన్ని భారంగా భావిస్తున్న వందలాది మంది వృద్ధులకు, నిరుపేదల కోసం దగ్గరుండి ప్రత్యేక శిబిరాలకు పంపించి ఉచితంగా శస్త్రచికిత్సలు చేయించారు. ఎందరికో నూతన చూపును ప్రసాదించి, వారి కళ్లలో ఆనంద బాష్పాలను చూశారు. ప్రభుత్వ పథకాలు పేద ప్రజలకు అందేలా కృషి చేసారు.ఎంతో మంది వృద్ధులకు తాను సంపాదించిన వాటిలో బట్టలు మందులు కొనిచ్చేవారు.నిరుపేద విద్యార్థులు చిన్నారులు పాఠ్య పుస్తకాలు వితరణ చేస్తూ తన మానవత్వాన్ని చాటుకున్నారు.

**సేవకు సలాం.. అవార్డుల వరం:**
ఆమె గుండెల్లోని తపనను, నిస్వార్థ సేవను సమాజం గుర్తించింది. వరుస పురస్కారాలతో అమెను గౌరవించింది.
2021 లో బి ఎస్ ఏ సంస్థ ద్వారా వైద్య రత్న అవార్డు ను అలాగే 2024 లో సావిత్రిబాయి పూలే ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'వైద్య రత్న' అవార్డులతో సత్కరించబడ్డారు.తాజాగా ఈ 2026 లో ప్రతిష్టాత్మక 'జీవన రక్ష' అవార్డును మేడిద సుబ్బయ్య ట్రస్ట్ ద్వారా అందుకుని, మానవత్వానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచారు.

**ఆమె ఒక స్ఫూర్తి.. ఒక ఆదర్శం:**
సొంత బాధ నుండి సమాజ సేవ వైపు అడుగులు వేసి, డబ్బు వెనుక పరుగులు తీస్తున్న నేటి ప్రపంచంలో ప్రాణం విలువను చాటిచెప్పిన మనీషి నీలం పార్వతి ఏజెన్సీ ప్రాంతాల్లోని ప్రతి గుడిసెకు ఆమె ఒక భరోసా. వృత్తిని వ్యాపారంగా కాకుండా బాధ్యతగా మార్చుకున్న ఆమె సేవలు అనన్యం, ఆదర్శప్రాయం. ఆమె ప్రస్థానం మరెందరో యువ వైద్యులకు మార్గదర్శకం కావాలని ఆశిస్తూ... 'జీవన రక్ష' నీలం పార్వతి కి సెల్యూట్!



## దిగణేశుడి ఊరేగింపుకు డీజే లకు అనుమతులు లేవ్ - ఎస్సై శ్రీశైలం

### నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

### శాంతియుతంగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గణేశుని ఉత్సవాలు

**బొమ్మలరామారం సెప్టెంబర్ 9 (జనంసాక్షి)**
వినాయక చవితి ఉత్సవాలను ప్రజలు శాంతియుతంగా ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జరుపుకోవాలని బొమ్మలు రామారం ఎస్సై శ్రీశైలం సూచించారు. బుధవారం మండల సర్పంచులు అందరితో పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గణేష్ ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో ఎలాంటి సంఘటనలు జరగకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని సర్పంచులకు సూచించారు. గణేశుని ఏర్పాటు చేసే ప్రతి ఒక్కరు https://policeportal. tspolice. gov. in/ index.htm పోర్టల్ లో తప్పనిసరిగా వారి యొక్క వివరాలు నమోదు చేసి అనుమతి పొందాలని తెలియజేశారు. గణేశుడి శోభాయాత్రలో డీజే కు అనుమతి లేదని పలు నిబంధనల గురించి వివరించారు. నిబంధనలు ఉల్లంగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే గణేశు ని నిమజ్జనంలో సమయంలో ప్రమాదాలు జరగకుండా ప్రజలు జాగ్రత్తగా ఉండాలని కోరారు.

## శ్రీచైతన్య పాఠశాలలో ఘనంగా తెలుగుభాషా దినోత్సవం

**కొత్తగూడెం క్రైమ్, సెప్టెంబర్ 09 (జనం సాక్షి):**



పాల్వంచ పట్టణంలోని ఒడ్డుగూడెం శ్రీచైతన్య పాఠశాలలో ప్రజాకవి, తెలంగాణ ఉద్యమ శిఖర పురుషుడు కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకుని బుధవారం తెలుగుభాషా దినోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులు కాళోజీ నారాయణరావు, తెలుగుతల్లి, శ్రీకృష్ణదేవరాయలు, కవిత్రయం (నన్నయ, తిక్కన, ఎర్రన) మరియు పోతన వేషధారణలలో ఆకట్టుకున్నారు.కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాణి మిరియాల మాట్లాడుతూ అమ్మ ప్రేమలా స్వచ్ఛమైనది, అమృతం కంటే తియ్యనైనది మన తెలుగు భాష అని కొనియాడారు. "దేశభాషలందు తెలుగు లెస్స" అని శ్రీకృష్ణదేవరాయలు చెప్పిన మాటలను గుర్తుచేస్తూ, విద్యార్థులు మాతృభాషపై మక్కువ పెంచుకోవాలని సూచించారు.?అనంతరం కొత్తగూడెం జోన్ ఏజీయం వీరయ్య మాట్లాడుతూ.. 'ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్'గా, భారతదేశంలో ప్రాచీన భాషా హోదా (క్లాసికల్ లాంగ్వేజ్) పొందిన తెలుగు భాషకు విశ్వవ్యాప్తంగా గౌరవం తెలపడం మనందరి బాధ్యత అని పేర్కొన్నారు. ఎన్ని పరభాషలు నేర్చుకున్నా మాతృభాషను మరువకూడదని పిలుపునిచ్చారు.?తెలుగుభాషా విశిష్టత ను చాటుతూ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక నృత్యాలు, స్కిట్లు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ వేడుకల్లో ప్రైమరీ ఇన్చార్జ్ మహమ్మద్ సిరాజ్ బేగం, పి.పి.టి ఇన్చార్జ్ బండారు శిరీష, ఉపాధ్యాయలు భావన, భవాని ,చందన, శ్రీవల్లి మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



## ఆపదలో ఉన్న ఆర్టిస్టుల కుటుంబాలకు అండగా ఉంటాం

**సూర్యాపేట (జనంసాక్షి):**
ఏపూరు గ్రామానికి చెందిన ఆర్టిస్ట్ అర్జున్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలుసుకున్న ఆర్టిస్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గుడిగుంట్ల గోవర్ధన్ గౌడ్ మానవతా దృక్పథంతో స్పందించారు. సీనియర్ ఆర్టిస్టులు,అసోసియేషన్ సభ్యుల సహకారంతో అర్జున్‌కు రూ.5వేల ఆర్థిక సహాయాన్ని బుధవారం అందజేశారు.ఈ సందర్భంగా గుడిగుంట్ల గోవర్ధన్ గౌడ్ మాట్లాడుతూ కళాకారుల కుటుంబాల్లో ఎవరైనా ఆపదలో ఉన్నప్పుడు వారికి అండగా నిలవడం తమ బాధ్యత అన్నారు.అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న కళాకారులకు తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు.భవిష్యత్తులోనూ ఆపదలో ఉన్న కళాకారులు, వారి కుటుంబాలను ఆదుకునేందుకు ఆర్టిస్ట్ అసోసియేషన్ ముందుంటుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రాజు ఆర్ట్స్ , శ్రీను, తరుణ్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పై ఎం ఎల్ ఏ శంకర్ అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ బిఆర్ఎస్ నిరసన ప్రదర్శన

### శంకర్ పై ఎఫ్ ఐ ఆర్ నమోదు చేయాలంటూ పదుల సంఖ్యలో పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు

**పెనుబల్లి, సెప్టెంబర్ 9 (జనంసాక్షి)**



తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పై తెలంగాణ సమాజం తలదించుకునేలా మాట్లాడిన షాద్నగర్ ఎమ్మెల్యే వీర్నపల్లి శంకర్ వ్యాఖ్యలను ఖండిస్తూపెనుబల్లి మండల బి ఆర్ ఎస్ పార్టీ ఆధ్వర్యంలో వి.ఎం.బంజర్ రింగ్ సెంటర్ నుండి పోలీస్ స్టేషన్ వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు, అనంతరం వి ఎం బంజర్ పోలీస్ స్టేషన్ లో ఎస్ ఐ షాకీర్ కు ఎం ఎల్ ఏ శంకర్ పై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలంటూ పదుల సంఖ్యలో పార్టీ నాయకులు ఫిర్యాదు చేయడం జరిగింది . ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కనగాల వెంకటరావు, మాజీ జెడ్పిటిసి చెక్కిలాల మోహన్రావు, చెక్కిలాల లక్ష్మణరావు, మండల నాయకులు కోటగిరి సుధాకర్ బాబు, మందడపు అశోక్, పెనుబల్లి సర్పంచ్ బానోత్ పాపాలక్ష్మి, కందిమల్ల వారి బంజర సర్పంచ్ కొంగలరాంబాబు, కొప్పుల గోవిందరావు, వంగా చిన్న పండు, కొత్తగుండ్లఅప్పారావు, కాకాసీతా రాములు, వంగాచంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## తాతా మధును వెంటనే ఎమ్మెల్సీ పదవి నుంచి బర్తరఫ్ చేయాలి

### కాంగ్రెస్ జిల్లా ఎస్సీ సెల్ జనరల్ సెక్రటరీ దేపంగి వెంకటరమణ

**అశ్వాపురం, సెప్టెంబర్ 9 (జనంసాక్షి)**



తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను కాంగ్రెస్ జిల్లా ఎస్సీ సెల్ జనరల్ సెక్రటరీ దేపంగి వెంకటరమణ తీవ్రంగా ఖండించారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న స్పీకర్‌పై వ్యక్తిగత, అప్రజాస్వామిక వ్యాఖ్యలు చేయడం సరికాదని, ఇది రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. ప్రజాప్రతినిధులు రాజ్యాంగ పదవుల గౌరవాన్ని కాపాడుతూ హుందాగా వ్యవహరించాల్సిన బాధ్యత ఉందన్నారు.తాతా మధు తన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని స్పీకర్‌కు బహిరంగ క్షమాపణ చెప్పాలని, ఆయనపై తక్షణ చర్యలు తీసుకుని ఎమ్మెల్సీ పదవి నుంచి బర్తరఫ్ చేయాలని దేపంగి వెంకటరమణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# గిరిజన హక్కుల సాధనలో సేవాలాల్ సేన కీలక పాత్ర

**○ సారపాక గాంధీనగర్ తండాలో ఘనంగా 12వ ఆవిర్భావ వార్షికోత్సవ వేడుకలు..**

**○ బంజారా, గిరిజన సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటం కొనసాగిస్తాం..**

**బూర్గంపహాడ్ సెప్టెంబర్ 09 (జనంసాక్షి)** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా :- బంజారా, గిరిజనుల హక్కులు, సమస్యల పరిష్కారం కోసం సేవాలాల్ సేన 12 ఏళ్లుగా నిరంతరం పోరాటాలు, ప్రజా కార్యక్రమాలు నిర్వహిస్తూ ముందుకు సాగుతోందని నాయకులు అన్నారు. సేవాలాల్ సేన 12వ ఆవిర్భావ వార్షికోత్సవ వేడుకలు బూర్గం పహాడ్ మండలం సారపాక గాంధీనగర్ తండాలో ఘనంగా నిర్వహించారు. సేవాలాల్ సేన వ్యవస్థాపక అధ్యక్షులు భూక్య సంజీవ్ నాయక్, రాష్ట్ర అధ్యక్షులు హుస్సేన్ నాయక్ ఆదేశాల మేరకు ఆంగోత్ రఘు అధ్యక్షతన జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి హతిరాం మఠం ట్రస్టు చైర్మన్ అజ్మీర వెంకన్న, సేవాలాల్ విద్యార్థి సేన జిల్లా అధ్యక్షులు సైదా నాయక్ బానోత్, మండల అధ్యక్షులు రాంబాబు నాయక్, యువజన అధ్యక్షులు ప్రేమ్ సింగ్ నాయక్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తండాలను గ్రామ పంచాయతీలుగా సాధించడంలో, 10 శాతం రిజర్వేషన్ సాధనలో, సేవాలాల్ మహారాజ్ జయంతిని అధికారికంగా నిర్వహించేలా కృషి చేయడంలో సేవాలాల్ సేన తనదైన పాత్ర పోషించిందన్నారు. అలాగే పోడు భూముల పట్టాల కోసం పాదయాత్రలు నిర్వహించడం, ఏజెన్సీ డీఎస్సీ ద్వారా వందలాది మంది ఉపాధ్యాయులకు ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా ఉద్యమాలు చేపట్టడం వంటి అనేక కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. 12 ఏళ్ల ప్రస్థానాన్ని స్ఫూర్తిగా తీసుకుని రాబోయే రోజుల్లోనూ గిరిజన జాతి ఎదుర్కొంటున్న సమస్యలపై ఐక్యంగా పోరాడుతామని నాయకులు స్పష్టం చేశారు. బంజారా, గిరిజనుల హక్కులు, అభివృద్ధి, సంక్షేమం



కోసం సేవాలాల్ సేన తన ఉద్యమాన్ని మరింత బలోపేతం చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాస్కర్‌నగర్, గాంధీనగర్, సారపాక ప్రాంతాలకు చెందిన కుల పెద్దలు, జిల్లా, మండల నాయకులు, కార్యదర్శులు, గ్రామ అధ్యక్షులు, కార్యదర్శులు, యువజన నాయకులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బాల్యవివాహాలు నిర్వహిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవు

### సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ రోహిత్ రాజు

**కొత్తగూడెం క్రైమ్, సెప్టెంబర్09 (జనంసాక్షి):** బాల్యవివాహాలు నిర్వహించిన మరియు సహకరించిన వారిపై కఠిన చర్యలు తప్పవని సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ రోహిత్ రాజు సూచించారు. బాల్య వివాహ వ్యతిరేక దినోత్సవం గా ఐక్యరాజ్యసమితి ప్రతిపాదించిన నవంబర్ 27వ తారీకు ను పురస్కరించుకొని యాక్షన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్మెంట్ జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ సంస్థ సభ్యులు ఎస్పీని మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఎవరైనా బాల్యవివాహాలు చేసిన సహకరించిన వారిపై బాల్య వివాహ నిరోధక చట్టం మరియు పోక్సో యాక్ట్ కూడా విధించబడుతుందని తెలిపారు. బాల్యవివాహాలు జిల్లాలో ఎక్కడైనా జరుగుతున్నట్టు సమాచారం తెలిసినట్లయితే వెంటనే 1098 లేదా డయల్ 100 లేదా జస్ట్ రైట్స్ వారికి తెలియజేయాలని కోరారు, ఈ కార్యక్రమానికి ఎయిడ్ సేవా సంస్థ జిల్లా కోఆర్డినేటర్ వి రాజేష్ సభ్యులు మోహన్ మాన్సింగ్ రవిచంద్ర నాగేంద్రబాబు మౌనిక పాల్గొన్నారు.



## గణేష్ మండపాల నిర్వాహకులకు పోలీసుల అవగాహన



ఖమ్మం జిల్లా సింగరేణి మండలంలో గణేష్ నవరాత్రుల సందర్భంగా శాంతియుత వాతావరణంలో వేడుకలు నిర్వహించేందుకు గణేష్ మండపాల నిర్వాహకులు, డీజే నిర్వాహకులు, సంబంధిత ప్రతినిధులతో కారేపల్లి పోలీస్‌స్టేషన్‌లో సిఐ సాగర్, ఎస్సై గోపి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ శాఖ సూచనలు, మండపాల పర్మిషన్ నిబంధనలు పాటించడం, డీజే వినియోగంపై నిబంధనలు, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా చర్యలపై నిర్వాహకులకు అవగాహన కల్పించారు. వేడుకల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా నిర్వాహకులు పోలీసులకు సహకరించాలని అధికారులు దిశా నిర్దేశం చేశారు.



## ట్రాక్టర్ బోల్తా పడి గాయాల పాలైన క్షతగాత్రులను పరామర్శించిన సిపిఐ నేతలు

**కొత్తగూడెం క్రైమ్, సెప్టెంబర్ 9 (జనంసాక్షి)** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం సత్యనారాయణపురం-మందేరికలపాడు గ్రామాల పరిధిలో పొలం పనులకు వెళుతున్న 15 మంది కూలీల ట్రాక్టర్ డ్రైవర్ నిర్లక్ష్యం వలన బుధవారం అదుపుతప్పి బోల్తాపడడంతో ట్రాక్టర్ లో ఉన్న కూలీలందరికీ దెబ్బలు తగలడంతో హుటాహుటిన పాల్వంచ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా విషయం తెలుసుకున్న భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) నేతలు కామ్రేడ్ వీసంశెట్టి పూర్ణచంద్రరావు (పాల్వంచ మండల కార్యదర్శి) కామ్రేడ్ నిమ్మల రాంబాబు(జిల్లా సమితి సభ్యుడు) క్షతగాత్రులను పరామర్శించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని. తీవ్రంగా గాయపడిన కూలీలను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని. రెక్కాడితే కానీ డొక్కాడని ఆ నిరుపేద కూలీలు ప్రమాదవశాత్తు పడి గాయాల పాలవడంతో వారి కుటుంబ సభ్యులు చాలా ఆర్థిక ఇబ్బందులు పడాల్సి వస్తుందని కావున గాయపడిన కూలీలకు ప్రభుత్వం తరఫున ఒక్కో కుటుంబానికి 30,000/-వేల చొప్పున ఆర్థిక సహాయం అందించాలని. తీవ్రంగా గాయపడి చేతులు విరిగిన, తల పగిలిన వారికి 50,000/- ఏభై వేల రూపాయల తక్షణ సహాయం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణపురం సర్పంచ్ జర్పుల సంధ్య, నవీన్ మందేరికెలపాడు సర్పంచ్ బానోత్ లక్ష్మి -మోహన్, ఉప సర్పంచ్ కందుకూరి శ్రీను,మాజీ ఉపసర్పంచ్ కాటి అచ్చయ్య,



పార్టీ ప్రజాసంఘాల నాయకులు చిల్లా కృష్ణ , నవీన్ తదితరులు పాల్గొన్నారు.



# మహిళా అధికారులకు పుస్తకాలు అందజేత



**ఖమ్మం కార్పొరేషన్, సెప్టెంబర్ 9 (జనంసాక్షి)** జమాతే ఇస్లామీ హింద్ ఖమ్మం నగర శాఖ ఆధ్వర్యంలో ప్రవక్త మహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం జీవిత చరిత్ర, ఆయన బోధనలు, మానవతా విలువలను పరిచయం చేసే పుస్తకాలను కలెక్టర్ కార్యాలయంలోని మహిళా అధికారులైన, జాయింట్ డైరెక్టర్ బ్యాక్‌వర్డ్ క్లాస్ డెవలప్‌మెంట్ జ్యోతి, హార్టికల్చర్ అండ్ సిరికల్చర్ జాయింట్ డైరెక్టర్ అనసూయ, జిల్లా వెల్ఫేర్ అధికారి ప్రమీల, ఎంప్లాయ్‌మెంట్ అధికారి మాధవి, డీఆర్వో సూపరింటెండెంట్ సాదియా , సివిల్ సప్లై అధికారి సృజన, ఉమెన్స్ హబ్ కోఆర్డినేటర్ సమ్రీన్ ఇతర మహిళా అధికారులకు పుస్తకాలను అందజేశారు. స్వామి లక్ష్మీ శంకరాచార్య రచించిన మహమ్మద్ ప్రవక్త చూపిన జీవన ప్రబోధనలు, కేఎస్ రామకృష్ణారావు రచించిన ఇస్లాం ప్రవక్త మహమ్మద్ , యస్.ఎమ్. మలిక్ రచించిన ఆదర్శమూర్తి మహమ్మద్ తదితర పుస్తకాలను జమాతే ఇస్లామీ హింద్ ఖమ్మం నగర శాఖ అధ్యక్షురాలు అస్మా అంజుమ్, నగర పీఆర్ కన్వీనర్ హాజీరా సదఫ్, సెంట్రల్ శాఖ అధ్యక్షురాలు అస్ఫియా అంజుమ్, పీఆర్ సభ్యులు ఫైజా ఇరం, సబిహా కలిసి అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా నగర శాఖ అధ్యక్షురాలు అస్మా అంజుమ్ మాట్లాడుతూ ప్రవక్త మహమ్మద్ అనాథలు, పేదలు, బలహీనులు, అవసరంలో ఉన్నవారి పట్ల దయ, కరుణ చూపాలని బోధించారని తెలిపారు. పొరుగువారి హక్కులను గౌరవించడం, వారి హక్కులను పరిరక్షించడం, సమాజంలో పరస్పర ప్రేమ, సోదరభావం, సహకారాన్ని పెంపొందించడం వంటి విలువలకు ఆయన ఎంతో ప్రాధాన్యత ఇచ్చారని పేర్కొన్నారు. నగర పీఆర్ కన్వీనర్ హాజీరా సదఫ్ మాట్లాడుతూ ప్రపంచ చరిత్రలో అత్యంత ప్రభావశీలులైన వ్యక్తులపై మైఖేల్ హెచ్. హార్ట్ రచించిన పుస్తకంలో ప్రవక్త కు ప్రథమ స్థానం కల్పించారని తెలిపారు. ప్రవక్త బోధనలు, ఆయన చూపిన మార్గం ప్రపంచ చరిత్రపై చూపిన ప్రభావాన్ని ఇది తెలియజేస్తుందని అన్నారు. సెంట్రల్ శాఖ అధ్యక్షురాలు అస్ఫియా అంజుమ్ ప్రజల మాట్లాడుతూ పట్ల జాలి, కరుణ, ఆదరణతో వ్యవహరించాలని, మాటల ద్వారా , చేతల ద్వారా ఇతరులకు ఇబ్బంది కలిగించకుండా జీవించాలని, ప్రవక్త మహమ్మద్ బోధించారని, ఆమె తెలిపారు. దయ, న్యాయం, సోదరభావం, పరస్పర గౌరవం వంటి మానవతా విలువలు సమాజంలో శాంతి, సామరస్యాన్ని పెంపొందించేందుకు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. ప్రవక్త మహమ్మద్ జీవితాన్ని, ఆయన బోధించిన మానవతా విలువలను సమాజంలోని వివిధ వర్గాలకు పరిచయం చేయాలనే ఉద్దేశంతో ఈ పుస్తకాలను అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

# ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

### కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కు వినతి



**టేకులపల్లి, సెప్టెంబర్ 9 (జనంసాక్షి):** ఉపాధ్యాయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని, గిరిజన చట్టాలను పగడ్బందీగా అమలు పరచాలని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ను కలిసి సమస్యలను వివరించి బిజెపి టీచర్స్ సెల్ జిల్లా కన్వీనర్, గిరిజన ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు వాంకుడోత్ పార్వతి హాథిరాం నాయక్ వినతి పత్రాలు అందజేశారు. బుధవారం భద్రాచలం లో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ను మర్యాద పూర్వకంగా కలిసి ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యలు గిరిజన చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని గిరిజన రైతులకు రావలసిన పోడు పట్టాలు ఇప్పించాలని వారి దృష్టికి తీసుకు వెళ్లారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బై రెడ్డి ప్రభాకర్ రెడ్డి, జిల్లా నాయకులు బాలాజీ నాయక్, డ్రెస్సింగ్ మండల నాయకులు శంభు నాయక్,దరావత్ సురేష్, బాల తదితరులు పాల్గొన్నారు.

## సేవాలాల్ సేన 11వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జండా ఆవిష్కరణ

### సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు ఎవరు నాయక్



**తిరుమలాయపాలెం, సెప్టెంబర్ 9 (జనంసాక్షి)** సేవాలాల్ సేన 11వ ఆవిర్భా దినోత్సవం పురస్కరించుకొని ఖమ్మం జిల్లా సేవాలాల్ సేన అధ్యక్షులు గూగు లోతు నెహురు నాయక్ ఆధ్వర్యంలో ఘనంగా జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా సేవాలాల్ సేన వ్యవస్థాపక అధ్యక్షులు ధారావత్ ప్రేమ్చంద్ నాయక్ సేవాలాల్ రాష్ట్ర అధ్యక్షులు ఇంగోత్రాంబాబు నాయక్ సేవాలాల్ సేన నాయకులు కార్యకర్తలు పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో తిరుమలయపాలెం మండల గ్రామ పంచాయతీ సర్పంచ్ ధారావత్ సుజాత నరసింహారావు తిరుమలాయపాలెం మండల కాంగ్రెస్ అధ్యక్షులు కొప్పుల జేపీసీ ఖమ్మం జిల్లా అధ్యక్షుల మందడి ఇజ్రాయిల్ తదితరులు పాల్గొన్నారు.

# మానవత్వానికి నిలువెత్తు నిదర్శనం

## హాలియాలో కరాటే మాస్టర్ తంగేళ్ల సత్యనారాయణ రాజు

**హాలియా, సెప్టెంబర్ 9, 2026 జనంసాక్షి:** నిజాయితీ, మానవత్వానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచారు హాలియాకు చెందిన కరాటే మాస్టర్ తంగేళ్ల సత్యనారాయణ రాజు. ఈ నెల 6వ తేదీ ఆదివారం హాలియాలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) ఏటీఎంలో ఒక వ్యక్తి డిపాజిట్ చేసిన రూ.43,000 నగదు తిరిగి బయటకు రావడంతో, ఆ మొత్తాన్ని భద్రపరచి, 9వ తేదీ బుధవారం సంబంధిత బ్యాంకు శాఖ మేనేజర్ ద్వారా యజమానికి అప్పగించారు.

**వివరాలు:**
ఈ నెల 6వ తేదీ ఆదివారం హాలియా ఎస్‌బిఐ ఏటీఎంలో సత్యనారాయణ రెడ్డి అనే వ్యక్తి రూ.43,000 నగదును డిపాజిట్ చేయడానికి వచ్చారు.
నగదు డిపాజిట్ అయినట్లు భావించి ఆయన అక్కడి నుంచి వెళ్లిపోయారు. అయితే ఆ నగదు ఏటీఎం నుంచి తిరిగి బయటకు రావడంతో, ఆయన వెనుకే ఉన్న కరాటే మాస్టర్ తంగేళ్ల సత్యనారాయణ రాజు ఆ మొత్తాన్ని గుర్తించారు.
"ఇతరుల సొమ్మును కాపాడి వారికి తిరిగి అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత. ఇది ఎవరి ఎమర్జెన్సీ సొమ్మో కాబట్టి, ఇలాంటి సందర్భాల్లో తప్పకుండా తిరిగి అందేలా చూడాలి. మానవత్వం, నిజాయితీకి ఎప్పటికీ విలువ ఇవ్వాలి" అని తంగేళ్ల సత్యనారాయణ రాజు అన్నారు.
9వ తేదీ బుధవారం ఎస్‌బిఐ బ్రాంచ్ మేనేజర్ లావురి మోహన్ నాయక్ ఆధ్వర్యంలో ఆ నగదును యజమానికి అప్పగించారు.




**బ్యాంకు మేనేజర్ అభినందన:**
"కరాటే మాస్టర్ తంగేళ్ల సత్యనారాయణ రాజు లాంటి నిజాయితీ, మానవత్వం కలిగిన వ్యక్తులు సమాజంలో ఉండటం ఎంతో గర్వకారణం. ఆయన చేసిన ఈ మంచి పని ప్రతి ఒక్కరికీ ఆదర్శంగా నిలుస్తుంది" అని ఎస్‌బిఐ బ్రాంచ్ మేనేజర్ లావురి మోహన్ నాయక్ కొనియాడారు.

**యజమాని ప్రతిక్రియ:**
తన నగదు తిరిగి అందడంతో సత్యనారాయణ రెడ్డి కరాటే మాస్టర్ తంగేళ్ల సత్యనారాయణ రాజుకు కృతజ్ఞతలు తెలిపారు.



# గిన్నిస్ బుక్ లో చోటు సంపాదించడం అభినందనీయం

**తుంగతుర్తి సెప్టెంబర్ 9 (జనంసాక్షి)**
గిన్నిస్ బుక్ లో చోటు సంపాదించడం అభినందనీయమని సూర్యాపేట జిల్లా అదనపు కలెక్టర్ హరి సింగ్ అన్నారు, బుధవారం మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయంలో ఇటీవల మండల కేంద్రానికి చెందిన బొంకురి అరుణ కరాటే విభాగంలో గిన్నిస్ బుక్ లో చోటు సంపాదించారు, ఈ మేరకు ఆయన ఆమెను శాలువాతో సన్మానించి అభినందనలు తెలియజేశారు, మరి ఎంతో మంది విద్యార్థులను కరాటే లో శిక్షణ ఇవ్వాలని సూచించారు ఈ కార్యక్రమంలో తాసిల్దార్ దయానందం తో పాటు పలువురు పాల్గొన్నారు.

# ఘనంగా కాళోజి జయంతి నరేష్

**మాడుగులపల్లి, సెప్టెంబరు 9(జనంసాక్షి):**
ప్రజాకవి, పద్మవిభూషణ్ కాళోజి నారాయణరావు జయంతిని మాడుగులపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా సర్పంచ్ అరూరి నరేష్ కాళోజి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణ భాష, సంస్కృతి, ప్రజా సమస్యలకై తన కలంతో పోరాడిన మహనీయుడు కాళోజి అని కొనియాడారు ఆయన ఆలోచనలు, ఆశయాలు నేటి తరానికి మార్గదర్శకమని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మల్లెపల్లి వెంకన్న, పంచాయతీ కార్యదర్శి శ్రవణ్, నరేందర్, జానయ్య, అంగన్వాడీ టీచర్లు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# దళితుల ఆత్మగౌరవాన్ని కించపరిస్తే ఖబర్దార్!

## కేసీఆర్ దిష్టిబొమ్మ దగ్ధం

**తుంగతుర్తి, సెప్టెంబర్ 9,(జనం సాక్షి)**
దళిత స్పీకర్ ను అవమానించేలా బిఆర్ఎస్ నాయకులు, ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యలు సిగ్గుచేటని తుంగతుర్తి సింగిల్ విండో చైర్మన్ గుడిపాటి సైదులు మండిపడ్డారు. బుధవారం తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రంలో దళితుడైన అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ నే కాకుండా యావత్ దళిత జాతి తల్లులు బాధపడేలా అహంకార పూరిత మాటలు మాట్లాడిన బిఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు దిష్టి బొమ్మను కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల కమిటీ అధ్యక్షుడు తప్పట్ల శంకర్ ఆధ్వర్యంలో దహనం చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ అసెంబ్లీ స్పీకర్ గా గౌరవప్రదమైన రాజ్యాంగ బద్ధ పదవిలో ఉన్న గడ్డం ప్రసాద్ కుమార్ పై తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ వెంటనే ఆయనను భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో శాసనసభ స్పీకర్ పదవికి అత్యంత గౌరవం హోదా ఉంటుందని, అలాంటి ఉన్నత స్థానంలో ఉన్న దళిత బిడ్డపై వ్యక్తిగతంగా అవమానకర వ్యాఖ్యలు చేయడం తాతా మధు రాజకీయ సంస్కారానికి అద్దం పడుతుందని మండిపడ్డారు. బిఆర్ఎస్ నాయకులు చేసిన వ్యాఖ్యలకు నిరసనగా కెసిఆర్ ఫామ్ హౌస్ ముట్టడికి వెళ్లిన దళిత నాయకులపై దాడులను ఖండించారు. కెసిఆర్ ఫామ్ హౌస్ కు దళితులు వస్తే అపశకునం అని పసుపు నీళ్లతో శుద్ధి చేయించడానికి ఖండిస్తూ ఇది వాళ్ళ సంస్కారం అని అన్నారు. దళితుడు స్పీకర్ గా ఉంటే ఓర్చుకోలేని కేసీఆర్ నేతృత్వంలోని బిఆర్ఎస్ పార్టీ అసెంబ్లీ సమావేశాలకు కావడం లేదని విమర్శించారు. ప్రజలు ఓట్లు వేసి గెలిపించుకొని తమ బాధలు అసెంబ్లీలో వ్యక్తపరిచి సమస్యలను తీరుస్తారనుకుంటే అసెంబ్లీకి రాకుండా కుటిల రాజకీయాలు చేయడం బిఆర్ఎస్ నాయకులకే చెందుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రావులపల్లి ఎక్స్ రోడ్ తండా సర్పంచ్ గుగులోతు జ్యోతి రాము, కాంగ్రెస్ పార్టీ మహిళా మండల కమిటీ అధ్యక్షురాలు పులి సత్తమ్మ,కాంగ్రెస్ పార్టీ నాయకులు పోలేపాక రామచంద్రు, దీప్లా నాయక్, దాసరి శ్రీను, పులిగుజ్జ యాకయ్య, కొండ పరశు రాం, అనిల్ కాస్ట్రో, కొమ్ము అంజయ్య, పోడేటి యాదగిరి, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# కోదాడ పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా ఎన్నిక

## 36 ఓట్ల మెజార్టీతో పైడిమర్రి నారాయణ గెలుపు

**కోదాడ( జనం సాక్షి)**
కోదాడ పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా పైడిమర్రి నారాయణరావు విజయం సాధించారు. బుధవారం పట్టణంలోని కాశీనాథం ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన ఆర్యవైశ్య సంఘం ఎన్నికల్లో నారాయణరావు తన సమీప ప్రత్యర్థి రాయపూడి వెంకటనారాయణపై 36 ఓట్ల మెజార్టీతో ఘన విజయం సాధించారు.ఎన్నికల్లో మొత్తం 803 ఓట్లు పోలయ్యాయి. ఓట్ల లెక్కింపు అనంతరం పైడిమర్రి నారాయణరావుకు 419 ఓట్లు రాగా, ప్రత్యర్థి అభ్యర్థి రాయపూడి వెంకటనారాయణకు 387 ఓట్లు లభించాయి. దీంతో నారాయణరావు 32 ఓట్ల తేడాతో గెలిచినట్లు లెక్కలు సూచిస్తున్నాయి. అయితే, అందించిన వివరాల్లో మెజార్టీ 36 ఓట్లుగా పేర్కొన్నారు.ఎన్నికల ప్రక్రియను సంఘం ప్రతినిధులు, ఎన్నికల నిర్వాహకులు పర్యవేక్షించారు. ఫలితాలు వెలువడిన అనంతరం నారాయణరావు అనుచరులు, మద్దతుదారులు హర్షం వ్యక్తం చేశారు. ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన అనంతరం నారాయణరావు మాట్లాడుతూ.. సంఘ సభ్యుల విశ్వాసాన్ని నిలబెట్టుకునేలా పనిచేస్తానని, ఆర్యవైశ్యుల సంక్షేమం, ఐక్యతకు ప్రాధాన్యం ఇస్తానని తెలిపారు. సంఘాన్ని మరింత బలోపేతం చేసేందుకు అందరినీ కలుపుకొని ముందుకు సాగుతానని తెలిపారు.ఎన్నికల్లో తనకు మద్దతుగా నిలిచిన ప్రతి సభ్యుడికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. విజయం అనంతరం నారాయణరావు మద్దతుదారులు ఫంక్షన్‌హాల్ వద్ద సందడి చేశారు.





# విద్యార్థులకు నేరాలు, చట్టాల పై అవగాహన సదస్సు

**నేరేడుచర్ల (జనంసాక్షి):**
పాలకవీడు మండలంలో భవానిపురం డెక్కన్ సిమెంట్స్ లిమిటెడ్ కర్మాగారం ఆడిటోరియంలో పాలకవీడు ఎస్ఐ రువ్వ కోటేశ్ డి.సి.ఎల్. సంస్థ పాఠశాల విధ్యార్థులకు నేరాలు,చట్ట ప్రకారం పడే శిక్షలు, జీవితంలో అభివృద్ధి సాధించాలంటే ఉండవలసిన క్రమ శిక్షణ గురించి అవగాహన సదస్సును నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ డిజిటల్ మోసాలు, రోడ్లపై డ్రైవింగ్ విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆరోగ్యం పై మాదక ద్రవ్యాలు,డ్రగ్స్ యొక్క చెడు ప్రభావాలు,వాటి నిర్మూలన విషయాలతో పాటు ఆడపిల్లల విషయంలో గౌరవంగా మెలగవలసిన విధానాలను, తీసుకోవలసిన జాగ్రత్తలు మరియు నేరాలకు పాల్పడితే పడే శిక్షల గురించి వాస్తవ సంఘటనలను ఉదాహరిస్తూ విధ్యార్థులకు అవగాహన సదస్సును నిర్వహించి చదువు, భాధ్యత, మంచి అలవాట్లు, క్రమ శిక్షణ కలిగిన పిల్లలు తమ యొక్క కుటుంబం,దేశ అభివృద్ధికి దోహద పడతారని తెలియచేసారు. ఈ కార్యక్రమంలో సంస్థ యాజమాన్యం తరపున సంస్థ సి.జిఎం..నాగ మల్లేశ్వర రావ్,చీఫ్ మేనేజర్ బాబూరావ్,స్కూల్ సెక్రటరీ తిరుపతి రావ్,పాఠశాల హెడ్ మాస్టర్ శ్రీ జార్జ్ దేవాసియా. తదితరులు పాల్గొన్నారు .

# బెట్టింగ్ ఉచ్చులో చిక్కి వ్యక్తి బలవన్మరణం

## ఆర్థికంగా నష్టపోయినట్లు సూసైడ్ నోట్..

## భార్య ఫిర్యాదుతో కేసు నమోదు..

**బూర్గంపహాడ్ సెప్టెంబర్ 09 (జనంసాక్షి)**
లఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడిన ఘటన బూర్గంపహాడ్ మండల కేంద్రంలో జరిగింది. ఎస్సై మేడా ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. బూర్గంపహాడ్ గ్రామానికి చెందిన సాధనాల నాగేశ్వరరావు (39) మాంసం దుకాణం నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం సాయంత్రం బూర్గంపహాడ్ గ్రామ శివారులో ఉరేసుకుని విగతజీవిగా కనిపించాడు. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అక్కడ లభించిన సూసైడ్ నోట్‌లో.. అశ్వారావుపేట మండలం ఆసుపాకకు చెందిన ఓ వ్యక్తి ప్రోద్బలంతో బెట్టింగ్‌లకు అలవాటుపడి ఆర్థికంగా నష్టపోయినట్లు నాగేశ్వరరావు పేర్కొన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై మృతుడి భార్య మాధవి బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, సూసైడ్ నోట్‌లో పేర్కొన్న అంశాలపై దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మేడా ప్రసాద్ తెలిపారు.



# కలెక్టరేట్ ముట్టడికి యత్నం..

## మాజీ సర్పంచుల అరెస్ట్

*పెండింగ్ బిల్లుల కోసం ఆందోళన.. పోలీసుల తీరుపై ఆగ్రహం*

గుర్రంపోడు: సెప్టెంబర్ 09 (జనంసాక్షి)

పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ గుర్రంపోడు మండలానికి చెందిన మాజీ సర్పంచులు కలెక్టర్ కార్యాలయం ముట్టడికి బయలుదేరారు. విషయం తెలుసుకున్న పోలీసులు వారిని అడ్డుకుని అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా పోలీసుల తీరుపై మాజీ సర్పంచులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు మౌలిక వసతులు కల్పించేందుకు గ్రామాల్లో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు నెలల తరబడి పెండింగ్‌లో ఉన్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. బిల్లులు విడుదల చేయాలని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదని ఆరోపించారు. పెండింగ్ బిల్లుల విడుదల కోసం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందించేందుకు వెళ్తున్న తమను పోలీసులు అడ్డుకుని అరెస్ట్ చేయడం అన్యాయమని వారు పేర్కొన్నారు. తమ సమస్య పరిష్కారమయ్యే వరకు ఆందోళన కొనసాగిస్తామని స్పష్టం చేశారు. అరెస్టయిన వారిలో కొప్పోలు మాజీ సర్పంచ్ జ్యోతి లింగారెడ్డి, గుర్రంపోడు సర్పంచ్ సైద్మియా, ములకలపల్లి సర్పంచ్ దీపారాములు, ఆములూరు సర్పంచ్ బొమ్ము బాలమల్లయ్య, ఉట్లపల్లి సర్పంచ్ మదర్షి తదితరులు ఉన్నారు.

## అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కును కల్పించడమే ప్రధాన లక్ష్యం

### జిల్లా అదనపు కలెక్టర్ బి హరిసింగ్

**తుంగతుర్తి సెప్టెంబర్ 9 (జనంసాక్షి)**



అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కును కల్పించడమే ప్రధాన లక్ష్యమని జిల్లా అదనపు కలెక్టర్ బి హరి సింగ్ అన్నారు, బుధవారం మండల కేంద్రంలోని తాసిల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ఓటరు జాబితా పై సమీక్ష సమావేశంలో పాల్గొని మాట్లాడారు ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూఅర్హత కలిగిన ప్రతి పౌరుడి ఓటు హక్కును పరిరక్షించడమే ప్రధాన లక్ష్యమని ఎస్ఐఆర్ ప్రక్రియలో నియోజకవర్గంలో మొత్తం 50 వేల ఓట్లకు పైగా వివరాలు సరిగా లేకపోవడంతో నోటీసులు అందించడం జరిగిందన్నారు. నోటీసులు అందుకున్న వారు ఎలక్షన్ కమిషన్ జారీ చేసిన 13 రకాల పత్రాల్లో ఏదైనా ఒకటి చూపించి ఓటు హక్కును సరి చేసుకోవాలని సూచించారు. నవంబర్ 5 వరకు ఓటు హక్కును సరి చేసుకోవాలని నవంబర్ 9న తుది ఓటరు జాబితా ముసాయిదా విడుదల చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ దయానందం వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

### ఏ ఐ కె యం ఎస్ రాష్ట్ర కోశాధికారిగా కల్తీ వెంకటేశ్వర్లు ఎన్నిక

**టేకులపల్లి, సెప్టెంబర్ 9(జనంసాక్షి):**



సెప్టెంబర్ 8 .9 తేదీలలో అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) రాష్ట్ర మహాసభలు మంచిర్యాలలో జరిగాయి. ఈ మహాసభలలో ఏఐకేఎంఎస్ రాష్ట్ర కోశాధికారిగా టేకులపల్లికి చెందిన అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షులు కల్తీ వెంకటేశ్వర్లు ఎన్నిక అయినట్లు టేకులపల్లి మండల అధ్యక్ష, కార్యదర్శులు గూగులోతు రామచంద్, భూక్య హర్జ ఒక ప్రకటనలో తెలిపారు. అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యవర్గం టేకులపల్లి మండలానికి చెందిన కల్తీ వెంకటేశ్వర్లు రాష్ట్ర కోశాధికారిగా ఎన్నిక కావడం పట్ల రాష్ట్ర కమిటీకి కృతజ్ఞతలు తెలియజేశారు. ఎన్నికైన కల్తీ వెంకటేశ్వర్లకు అభినందనలు తెలియజేశారు.



# కంది పత్తి పంటలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

## మండల వ్యవసాయ అధికారి వెంకన్న

హాలియా జన్మ సాక్షి సెప్టెంబర్ 9

: వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఆత్మ (ఆత్మనిర్భర్ టు రైతు) పథకంలో భాగంగా ప్రత్యామ్నాయ పంటల ప్రోత్సాహకంగా సాగు చేస్తున్న కంది మరియు పత్తి పంటల్లో క్షేత్ర ప్రదర్శనలు (ఫీల్డ్ డెమోన్స్ట్రేషన్స్) ఈ రోజు నిర్వహించబడ్డాయి. కంది పంట ప్రస్తుతం పెరుగుదల దశలో ఉన్నందున, రసం పీల్చే పురుగుల ఉధృతి పెరిగే అవకాశం ఉందని, దీని నివారణకు అవసరమైన సమగ్ర సస్యరక్షణ చర్యలు మరియు పంటకు అవసరమైన పోషక యాజమాన్య పద్ధతులపై రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించడం జరిగింది. పత్తి పంటలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో, పంటను తేమ ఒత్తిడి నుంచి కాపాడేందుకు అనుసరించాల్సిన ప్రత్యామ్నాయ పద్ధతులపై రైతులకు వివరణ ఇవ్వబడింది. ముఖ్యంగా 2% యూరియా ద్రావణం లేదా నానో యూరియా లేదా 13-0-45 ఎరువును 5 గ్రాములు/లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయడం ద్వారా పంటలో తేమ ఒత్తిడిని తట్టుకునేలా చేసి, వర్షాలు వచ్చే వరకు పంట ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని రైతులకు సూచించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాలెం సర్పంచ్ జిల్లాల హరిబాబు, నాయుడుపాలెం సర్పంచ్ కందుల మదన్మోహన్ రెడ్డి, మండల వ్యవసాయ శాఖ అధికారులు, ఏఈఓలు రాములు, స్వాతి మరియు పాలెం, నాయుడుపాలెం గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

## గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి

### విగ్రహాలను ఆన్లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి ఎస్సై నాగరాజు

నూతనకల్ సెప్టెంబర్ 9 (జనంసాక్షి)



మండల వ్యాప్తంగా గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిర్వహించేందుకు రెవెన్యూ, విద్యుత్, ఇరిగేషన్ శాఖల అధికారులు,అన్ని రాజకీయ పార్టీల నాయకులు, గణేష్ ఉత్సవ నిర్వాహకులు, సర్పంచ్‌లు ఉప సర్పంచ్ లతో గణేష్ ఉత్సవ సమన్వయ సమావేశం నూతనకల్ మండల కేంద్రంలో బుధవారం పోలీసులు నిర్వహించారు ఈ సమావేశంలో ఉన్నతాధికారులు జారీ చేసిన సూచనలను సంబంధిత అందరికీ వివరించాము ముఖ్యంగా గణేష్ విగ్రహాల ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, ఊరేగింపు రూట్ మ్యాప్‌ల తయారీ సమర్పణ, ట్రాఫిక్ నిర్వహణ, శాంతిభద్రతల పరిరక్షణ తదితర అంశాలపై ఎస్సై సూచనలు ఇచ్చారు గణేష్ ఉత్సవ ఊరేగింపుల సమయంలో డీజే సౌండ్ సిస్టమ్‌లకు అనుమతి లేదని స్పష్టంగా తెలియజేయడం జరిగింది. నిర్దేశించిన సౌండ్ పరిమితులు ఇతర నిబంధనలను నిర్వాహకులు తప్పనిసరిగా పాటించాలని సూచించారు .గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా,సురక్షితంగా మరియు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా నిర్వహించేందుకు పోలీస్ శాఖకు అందరూ పూర్తి సహకారం అందించాలని వారు సూచించారు ఈ కార్యక్రమంలో తుంగతుర్తి ఏఎంసీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కట్ట మల్లారెడ్డి, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మున్న మల్లయ్య యాదవ్ వివిధ గ్రామాల సర్పంచులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## జాజిరెడ్డిగూడెం మండల ఎమ్మార్పీఎస్, ఎం ఎస్ పి మండల కమిటీలు ఎన్నిక

జాజిరెడ్డిగూడెం మండల ఎమ్మార్పీఎస్, ఎం ఎస్ పి ల నూతన కమిటీలను బుధవారం అర్వపల్లిలో తుంగతుర్తి నియోజకవర్గ ఇన్చార్జి పాల్వాయి బాలయ్య మాదిగ, చెడుపాక గంగరాజు మాదిగల ఆధ్వర్యంలో ఎన్నిక నిర్వహించడం జరిగింది. ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు పంది సురేందర్, ఇటికాల చిరంజీవిలు పాల్గొని ఈ ఎన్నికకు సహకరించారు. కమిటీ అధ్యక్షులుగా అర్వపల్లి గ్రామానికి చెందిన మేడి సంపత్ మాదిగ, ఉపాధ్యక్షులుగా దాసరి మహేష్ మాదిగ, శతకోటి వెంకన్న మాదిగ,ప్రధాన కార్యదర్శిగా దోరేపల్లి సాయికుమార్ మాదిగ, అధికార ప్రతినిధిగా గుండె పరమేష్ మాదిగ, కోశాధికారిగా జిల్లా ప్రవీణ్ మాదిగ, కార్యదర్శిగా చెడే వినోద్ మాదిగ, సహాయ కార్యదర్శి బందెల సత్తయ్య మాదిగ, ప్రచార కార్యదర్శిగా పానుగంటి చంటి మాదిగ, ఎం ఎస్ పి మండల అధ్యక్షులు చెరుకు అల్లయ్య మాదిగ, ఎంఎస్పి ప్రధాన కార్యదర్శి సూరారపు సైదులు గారిని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.

## భూ వివాదాల పరిష్కారానికే భూ రీ సర్వే.ఆర్డీవో వేణు మాధవరావు

**రైతులకు అవగాహన కల్పిస్తున్న ఆర్డీవో వేణుమాధవ రావు**

**పెన్ పహాడ్, సెప్టెంబర్ 09 (జనం సాక్షి) :**



భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపి, రైతులకు స్పష్టమైన యాజమాన్య హక్కులు కల్పించేందుకే రాష్ట్ర ప్రభుత్వం భూమి రీ సర్వే ప్రక్రియను ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని ఆర్డీవో వేణుమాధవరావు తెలిపారు. బుధవారం మండలంలోని అనాజిపురం గ్రామం లోని రైతువేదికలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో,మండలంలోని రాజపేట గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంచుకున్న నేపథ్యంలో ఆయన మాట్లాడుతూ, పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైన గ్రామంలో భూ రీ సర్వేను వంద శాతం విజయవంతం చేసేందుకు రైతులంతా క్షేత్రస్థాయిలో అధికారులకు పూర్తిస్థాయిలో సహకరించాలని పిలుపునిచ్చారు. రైతులెవరూ ఎలాంటి అపోహలకు లోనుకాకుండా సర్వేలో పాల్గొని తమ భూములకు సంబంధించిన సరైన వివరాలను అధికారులకు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారి ఏ డి ఏ శ్రీనివాసరెడ్డి,తహసిల్దార్ రాజశేఖరరెడ్డి ,సర్పంచ్ అనుములపూరి నాగయ్య, ఏ ఎస్ ఐ తాలూరి రాములు , మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్లు మర్కాల రంజిత్ రెడ్డి, అజి జున్నిషా, జీపీఓలు యాదగిరి, మధు, ఆదిత్య, చంద్రకళ, సంధ్య, ఏఈఓ మురళి, స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించాలి : సీ.ఐ టీ. రాము

## చండూరులో పీస్ కమిటీ సమావేశం

**చండూర్, సెప్టెంబర్ 9 (జనంసాక్షి)**



ఈ నెల 14వ తేదీ నుంచి ప్రారంభం కానున్న గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని చండూర్ పోలీసులు సూచించారు. బుధవారం చండూర్ పోలీస్ స్టేషన్‌లో గణేష్ ఉత్సవాల సందర్భంగా పీస్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా నిర్వాహకులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు సూచించారు. గణేష్ విగ్రహాల ఊరేగింపులు, ఉత్సవాల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని కోరారు. ముఖ్యంగా ఊరేగింపుల్లో డీజేలు వినియోగించరాదని స్పష్టం చేశారు. ప్రజలు, ఉత్సవ కమిటీ నిర్వాహకులు పోలీసుల సూచనలు పాటిస్తూ గణేష్ ఉత్సవాలను సోదరభావంతో, ప్రశాంతంగా నిర్వహించాలని అధికారులు సూచించారు. ఈ సమావేశంలో చండూర్ సీఐ టీ. రాము, ఎస్ఐ శివకుమార్, ఏఎస్సై వెంకటేశ్వర్లు, హెచ్‌సీ శంకరయ్య, పీసీలు కృష్ణ కౌశిక్, రాజు, అనిల్, కిరణ్‌కుమార్, సైదులు, చండూర్ మున్సిపల్ చైర్మన్ కోడి శ్రీనివాసులు, పాలకవర్గ సభ్యులు, చండూర్ మండలంలోని గ్రామ సర్పంచులు, వివిధ పార్టీల ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధుపై కఠిన చర్యలు తీసుకోవాలి

### యువజన కాంగ్రెస్ మండల కార్యదర్శి కూర సాలయ్య



**కొండమల్లేపల్లి, సెప్టెంబర్ 9 (జనంసాక్షి):**
తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై రాష్ట్రవ్యాప్తంగా దళిత వర్గాలు భగ్గుమంటున్నాయి. అసెంబ్లీ ఆవరణలో అసెంబ్లీ సాక్షిగా స్పీకర్ పీఠంపై ఉన్న వ్యక్తిపై అదీ దళిత సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం దళిత జాతి ఆత్మగౌరవాన్ని కించపరచడమేనని యువజన కాంగ్రెస్ మండల కార్యదర్శి కూర సాలయ్య మండిపడ్డారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా జరిగిన ఈ ఘటనలో స్పీకర్ గడ్డం ప్రసాద్ ను అవమానించడం దారుణం అన్నారు. భారతదేశ ప్రజాస్వామ్య వ్యవస్థలో అసెంబ్లీ స్పీకర్ పదవికి అత్యున్నతమైన గౌరవం ఉంటుందని అలాంటి రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న ఒక దళిత బిడ్డ గడ్డం ప్రసాద్ పై ఎమ్మెల్సీ తాతా మధు అలా మాట్లాడడం సరైంది కాదన్నారు. ఒక దళిత నాయకుడు స్పీకర్ స్థానంలో ఉంటే బిఆర్ఎస్ పార్టీ వాళ్లు జీవించుకోలేకపోతున్నారని భారత రాజ్యాంగ ప్రకారం ఒక అసెంబ్లీ స్పీకర్ కి మర్యాద ఇవ్వకపోతే సామాన్యమైన వ్యక్తులకు ఎలాంటి మర్యాద దక్కుతుందో రాష్ట్ర ప్రజలు తెలుసుకోవాలన్నారు. ఎమ్మెల్సీ తాత మధు తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కు వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని పేర్కొన్నారు.

## డాక్టరేట్ అందుకున్న తుంగతుర్తి వాసి భారతదేశంలో రిజర్వేషన్ల వ్యవస్థ పై సుదీర్ఘ పరిశోధనలకు గుర్తింపుగా గౌరవ డాక్టరేట్

**తుంగతుర్తి సెప్టెంబర్ 9(జనంసాక్షి)**
తుంగతుర్తి మండల కేంద్రానికి చెందిన పాల్వాయి నగేష్ ఉస్మాని విశ్వవిద్యాలయం నుండి గౌరవ డాక్టరేట్ పట్టాను అందుకున్నారు, హైదరాబాదు లో జరిగిన ఉస్మానియా విద్యాలయం 85 వ స్నాతకోత్సవము సందర్భంగా విశ్వవిద్యాలయం ఉన్నతాధికారుల చేతులమీదుగా డాక్టర్ పాల్వాయి నగేష్ గౌరవ డాక్టరేట్ పట్టాను స్వీకరించారు, ఈయన డాక్టర్ బీఆర్ అంబేద్కర్, మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ఉస్మానియా విశ్వవిద్యాలయం సోషియాలజీ విభాగంలో పీహెచ్‌డీలో చేరారు. భారతదేశం లో రిజర్వేషన్ల వ్యవస్థ' అనే అంశంపై సుదీర్ఘంగా అధ్యయనం చేసి విస్తృత పరిశోధన నిర్వహించారు, ఈ పరిశోధనలకు గుర్తింపుగా ఆయనకు డాక్టరేట్ పట్టా లభించింది,ఈ స్నాతకోత్సవంలో రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల ముఖ్యఅతిథిగా పాల్గొనగ భారత్ బయోటిక్ ఫౌండర్ చైర్మన్ డాక్టర్ కృష్ణ ఏం ఎల్ల వైస్ ఛాన్సలర్ కుమార్ మొలగరం చేతుల మీదుగా డా. పాల్వాయి నగేష్ అధికారికంగా పీహెచ్‌డీ పట్టాను అందుకున్నారు కూలి కుటుంబం నుంచి వచ్చిన ఓ యువకుడు.. పేపర్‌బాయ్‌గా పనిచేస్తూ చదువును కొనసాగించి.. పేదరికాన్ని జయించి.. ప్రజా ఉద్యమాల్లో పోరాడుతూ.. దళిత, బహుజన హక్కుల కోసం నిరంతరం ఉద్యమించారు.








## క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలి : ఎంపీడీవో జి. జలంధర్ రెడ్డి

**వలిగొండ, సెప్టెంబర్ 9( జనంసాక్షి)**
క్రీడలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, పట్టుదలను పెంచుతాయని ఎంపీడీవో జి. జలంధర్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో బుధవారం శ్రీ వెంకటేశ్వర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో హెచ్ఎం, ఎంఈఓ సుంకోజు భాస్కర్ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి క్రీడోత్సవాలు 2026 ను అండర్ 14 అండర్ 17 బాల బాలికల విభాగాలలో ఖో ఖో, కబడ్డీ ,వాలీబాల్ తదితర క్రీడా పోటీల ఉత్సవాన్ని ఎంపీడీవో టాస్ వేసి లాంచనంగా ప్రారంభించారు. అనంతరం ఎంపీడీవో మాట్లాడుతూ... క్రీడలతో మానసిక ప్రశాంతత, శారీరక దృఢత్వం కలుగుతాయని తెలిపారు. ప్రతి విద్యార్థి చదువుతో పాటు క్రీడల్లోనూ తన ప్రతిభను నిరూపించుకోవాలని సూచించారు.

**ఓటమి ఒక పాఠం.. ప్రయత్నమే ఆయుధం**

**ఎస్సై శ్రీకాంత్ రెడ్డి**

మాట్లాడుతూ... విఫలం ఎదురైనా వెనక్కి తగ్గకుండా విజయాన్ని సాధించే వరకు ప్రయత్నిస్తూనే ఉండాలని అన్నారు. తాను ప్రభుత్వ పాఠశాలలో చదువుకుని ఈ స్థాయికి ఎదిగానని పేర్కొన్నారు. విద్యార్థులు కష్టపడి చదువుతూ క్రీడల్లోనూ రాణించాలని, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి క్రమశిక్షణతో లక్ష్యం వైపు అడుగులు వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెంకట్ పాపిరెడ్డి, ఉప సర్పంచ్ మాధవి, పాఠశాల హెచ్ఎంలు, ఫిజికల్ డైరెక్టర్లు ,విద్యార్థిని విద్యార్థు లు పాల్గొన్నారు.

## ఘనంగా కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలు

### తెలంగాణ భాష యాస సంస్కృతిని కాపాడుకోవాలి -జిల్లా అదనపు కలెక్టర్ హరిసింగ్




**సూర్యాపేట (జనంసాక్షి):**
ప్రజాకవి, పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా తెలంగాణ భాషా దినోత్సవ వేడుకలను బుధవారం కలెక్టరేట్ లో ఘనంగా నిర్వహించారు. జిల్లా అదనపు కలెక్టర్ హరిసింగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొని కాళోజి నారాయణరావు చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, తెలంగాణ ప్రజల జీవన విధానం, భాష, యాస, సంస్కృతి, సామాజిక చైతన్యాన్ని తన రచనల ద్వారా చాటి చెప్పిన మహనీయుడు కాళోజి అని అన్నారు. ప్రజా కవి, సామాజిక ఉద్యమకారుడిగా కాళోజి చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. సామాన్య ప్రజల సమస్యలను తన సమస్యలుగా తన రచనల్లో ప్రతిబింబిస్తూ, ప్రజల పక్షాన నిలబడి వారి హక్కుల కోసం కాళోజి నిరంతరం పోరాడారని తెలిపారు. సమాజంలో జరుగుతున్న అన్యాయాలు, అసమానతలు, ప్రజల ఇబ్బందులపై తనదైన శైలిలో స్పందిస్తూ ప్రజల్లో చైతన్యం తీసుకురావడంలో కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. తెలంగాణ భాషకు, యాసకు ప్రత్యేకమైన గుర్తింపు, గౌరవం తీసుకు రావడంలో కాళోజి నారాయణరావు సాహిత్యం ఎంతో ప్రాధాన్యత కలిగి ఉందని, తెలంగాణ మాండలికంలో ఉన్న మాధుర్యాన్ని, ప్రజల భావోద్వేగాలను తన రచనల ద్వారా అందరికీ పరిచయం చేశారని అన్నారు. తెలంగాణ భాష మన అస్తిత్వానికి ప్రతీక తెలంగాణ భాష, యాస కేవలం మాట్లాడే విధానం మాత్రమే కాదని, అది తెలంగాణ ప్రజల జీవన విధానం, సంస్కృతి, సంప్రదాయాలు, ఆత్మగౌరవానికి ప్రతీక అని అన్నారు. తెలంగాణ భాషలోని ప్రత్యేకతను, మాధుర్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. ప్రస్తుత ఆధునిక కాలంలో ఇతర భాషల ప్రభావం పెరుగుతున్న నేపథ్యంలో మన మాతృభాష, తెలంగాణ యాస, సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా యువత కాళోజి సాహిత్యాన్ని చదివి, ఆయన ఆలోచనా విధానాన్ని అర్థం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ ప్రేమ్ రాజ్, బీసీ సంక్షేమ అధికారి విశాల్ ధారా, డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటరమణ, డీడబ్ల్యూఓ నరసింహారావు, డీటీఓ రవి కుమార్, డీఎస్ఓ మోహన్ బాబు, అధి కారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విద్యాభారతి హైస్కూల్‌లో 'పోలీస్ ప్రజా భరోసా' కార్యక్రమం

### విద్యార్థులకు మహిళా భద్రత, సైబర్ సెక్యూరిటీపై అవగాహన



**తుంగతుర్తి సెప్టెంబర్ 9 (జనంసాక్షి)**
నేడు సమాజంలో జరుగుతున్న సైబర్ క్రైమ్, మహిళ భద్రత పై అవగాహన కలిగి ఉండాలని తుంగతుర్తి ఎస్సై ఆర్ క్రాంతి కుమార్ అన్నారు, బుధవారం మండల కేంద్రంలోని శ్రీ విద్యా భారతి పాఠశాలలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోలీస్ సిబ్బందితో కలిసి 'పోలీస్ ప్రజా భరోసా' అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రస్తుత సమాజంలో జరుగుతున్న నేరాలు, విద్యార్థి దశ నుంచే చట్టాలపై కలిగి ఉండాల్సిన అవగాహన గురించి సవివరంగా వివరించారు విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, అదే సమయంలో సాంకేతికతను మంచి పనులకే వాడుతూ నేరాల బారిన పడకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. మహిళల భద్రత ౚ పోలీస్ అక్క: విద్యార్థినుల రక్షణకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. వేధింపులు, ఈవ్ టీజింగ్ వంటి సమస్యలు ఎదురైతే భయపడకుండా 'పోలీస్ అక్క' చొరవను ఉపయోగించుకుని పోలీసుల దృష్టికి తీసుకురావాలని కోరారు. డయల్ 112: ఏదైనా అత్యవసర పరిస్థితి లేదా ఆపద సమయాల్లో తక్షణ సహాయం కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'డయల్ 112' (ఆతిజీశ్రీ 112) ఉచిత సేవలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సైబర్ సెక్యూరిటీ ఆన్‌లైన్ గేమ్‌లకు బానిస కాకూడదని, సోషల్ మీడియా వాడకంలో అపరిచిత వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఓటిపి (ౚఖ)లు, వ్యక్తిగత ఫోటోలు, వివరాలను ఎవరికీ షేర్ చేయవద్దని హెచ్చరించారు.

విద్యార్థులు, యువత చెడు అలవాట్లకు, మాదకద్రవ్యాల (డ్రగ్స్) బారిన పడకుండా దూరంగా ఉండాలని, బంగారు భవిష్యత్తును పాడుచేసుకోవద్దని హితవు పలికారు. మైనర్ డ్రైవింగ్ చట్టరీత్యా నేరమని, విద్యార్థులు వాహనాలు నడపకూడదని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు మరియు ట్రాఫిక్ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో

విద్యాభారతి హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తుంగతుర్తి పోలీస్ స్టేషన్ సిబ్బంది మరియు విద్యార్థిని, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## గణేష్ నవరాత్రి ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని : సిఐ శ్రీను నాయక్

**నాగార్జునసాగర్ సెప్టెంబర్ 9 (జనంసాక్షి)**

రానున్న గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో కులమతా లకు అతీతంగా సామరస్యపూర్వకంగా జరుపుకోవాలని నాగార్జునసాగర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శీను నాయక్ పిలుపునిచ్చారు. విజయపురి పట్టణ పోలీస్ స్టేషన్లో గణేష్ ఉత్సవాల నిర్వహణపై పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు,ఈ సమావేశానికి సీఐ శీను నాయక్, ఎస్ఐ సతీష్,మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు, ఈ సందర్భంగా సీఐ శీను నాయక్ మాట్లాడుతూ ఉత్సవాల సమయంలో ఎటువంటి గొడవలు జరగకుండా అందరూ శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలని కోరారు. సోషల్ మీడియా వేదికగా మతాలను రెచ్చగొట్టే పోస్టులు, అనుచిత వ్యాఖ్యలు పెట్టే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు, ముఖ్యంగా గణేష్ మండపాల వద్ద తీసుకోవాల్సిన భద్రతా జాగ్రత్తల గురించి నిర్వాహకు లకు వివరించారు, ఉత్సవాల్లో డీజేల వినియోగానికి ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి లేదని ఆయన స్పష్టం చేశారు,అనంతరం నాగార్జునసాగర్ విజయపురి పట్టణ ఎస్ఐ సతీష్ మాట్లాడుతూ ఉత్సవాల నిర్వాహకు లు పోలీసు నిబంధనలను పాటించాలని కోరారు, మండపాల వద్ద అగ్నిప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, విద్యుత్ కనెక్షన్ల విషయంలో తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఏదైనా సమస్య ఉంటే వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా విజయపురి పట్టణంలో ఉత్సవాలు ప్రశాంతంగా ముగిసేలా అందరూ సహకరించాలని కోరారు.ఈ సమావేశంలో హెడ్ కానిస్టేబుల్స్, కానిస్టేబుల్స్, పలువురు మండపాల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ నవరాత్రుల ఉత్సవాలపై నిర్వాహకులకు అవగాహన సదస్సు

**చింతలపాలెం(జనంసాక్షి)**



వినాయకచవితి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని బుధవారం చింతల పాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని గణేష్ మండపాల నిర్వాహకు లతో సబ్ ఇన్స్పెక్టర్ పరమేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ఉత్సవాల నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు,పోలీస్ శాఖ నిబంధనలపై నిర్వాహకులకు ఎస్ఐ దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ,ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని పిలుపునిచ్చారు. శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా మండపాల నిర్వాహకులు పోలీసులకు సహకరించాలని కోరారు.వినాయక విగ్రహాల ఏర్పాటుకు పోలీస్, విద్యుత్,రెవెన్యూ శాఖల నుండి తప్పనిసరిగా ముందస్తు అనుమతి తీసుకోవాలి. మండపాల వద్ద ఎల్లప్పుడూ ఇద్దరు లేదా ముగ్గురు కమిటీ సభ్యులు అందుబాటులో ఉండాలి.రాత్రి వేళల్లో విగ్రహాల రక్షణకు నిర్వాహకులు పహారా కాయాలి.మండ పాల విద్యుత్ కనెక్షన్ల విషయంలో విద్యుత్ శాఖ నిబంధనలు పాటించాలి. నాణ్యమైన వైర్లను వాడాలి,షార్ట్ సర్క్యూట్ జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.నిఘా కోసం వీలైనంత వరకు మండపాల వద్ద సిసి కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి. అనుమతించిన సమయాల్లో మాత్రమే మైకులు,లౌడ్ స్పీకర్లు ఉపయోగించాలి. సుప్రీంకోర్టు నిబంధనల ప్రకారం రాత్రి 10 గంటల తర్వాత మైకులకు అనుమతి లేదు. మండపాల ఏర్పాటు వల్ల సామాన్య ప్రజలకు, వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలి. విగ్రహాల నిమజ్జనం సమయంలో చెరువులు,నదుల వద్ద పోలీస్ మరియు రక్షణ సిబ్బంది సూచనలను ఖచ్చితంగా పాటించాలి. యువత ఉత్సాహంతో ప్రమాదకరమైన చర్యలకు పాల్పడకూడదు.ఈ నియమ నిబంధనలను ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని ఎస్ఐ హెచ్చరిం చారు.ఈ కార్యక్రమంలో స్థానిక పోలీస్ సిబ్బంది మరియు చింతలపాలెం పరిధిలోని గణేష్ మండపాల నిర్వాహకులు,గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

### - మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలి

### - రైతు సంఘం రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు బుర్రి శ్రీరాములు డిమాండ్

**మునగాల, సెప్టెంబర్ 09(జనంసాక్షి):**



పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బుర్రి శ్రీరాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని సిపిఎం పార్టీ కార్యాలయంలో రైతు సంఘం మండల అధ్యక్షులు చందా చంద్రయ్య అధ్యక్షతన సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మునగాల మండల వ్యాప్తంగా పూత పిందె దశలో ఉన్న పత్తి వర్షాలు లేక పూర్తిగా ఎండిపోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారని ఆయన అన్నారు. వ్యవసాయ ఆధారిత పంటలను వ్యవసాయ అధికారులు పరిశీలించి ఎకరానికి 30 వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని ఆయన కోరారు. అదేవిధంగా మునగాల మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన యాప్ ను రద్దుచేసి సొసైటీల ద్వారా ఎరువులను రైతులకు అందించాలని డిమాండ్ చేశారు. త్రాగునీటి కోసం విడుదల చేసిన చెరువులు కుంటలు నింపితే వాటిని కొందరు దుర్వినియోగం చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు.ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు స్టాలిన్, రామకృష్ణారెడ్డి, మండవ వెంకటాద్రి, డివైఎఫ్ఐ నాయకులు గడ్డం వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ తాతా మధుపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

### జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు కాంపాటి శ్రీను

**కోదాడ,( జనంసాక్షి)**



శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ను అవమానించిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధుపై తక్షణమే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని, ఆయనను ఎమ్మెల్సీ పదవి నుంచి బర్తరఫ్ చేసి పదేళ్ల పాటు ఏ పదవీ చేపట్టకుండా చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి ఆదేశాల మేరకు బుధవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా కార్యదర్శి పిడతల శ్రీను ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన నాయకులు సమావేశమై బీఆర్ఎస్ వైఖరిపై ధ్వజమెత్తారు.ఈ సమావేశానికి జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు కాంపాటి శ్రీను ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. శాసనసభలో ప్రజా సమస్యలపై చర్చించకుండా బిఆర్ఎస్ పార్టీ నాయకులు వీధి రౌడీల మాదిరిగా ప్రవర్తించడం, మహిళా ప్రజాప్రతినిధులపై దౌర్జన్యానికి దిగడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. శాసనసభ గౌరవాన్ని దిగజారుస్తూ రౌడీయిజం చేయడం, మహిళలపై దౌర్జన్యాలకు పాల్పడటం సరికాదన్నారు.స్పీకర్ పదవికి భంగం కలిగించేలా వ్యవహరించిన నాయకులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.ఎమ్మెల్సీ తాతా మధును వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బహుజన నాయకులు బాజాన్, గుండెపంగు రమేష్, గంధం గిరి, రాజు నాయక్, లిక్కి మోహన్ రావు, సంజీవ్, శోభన్, జానీ, యేసయ్య, రఫీ, ఖాసీం భాయ్, ఖలీల్, షఫీ,అహ్మద్, వీరబాబు, ప్రవీణ్, రాంబాబు,పిడమర్తి బాబురావు, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## గుర్రంపోడులో యాదవ మహాసభ జిల్లా గౌరవ అధ్యక్షులు తగుళ్ల యాదయ్యకు సన్మానం

**గుర్రంపోడు, సెప్టెంబర్ 09, (జనంసాక్షి)**



గుర్రంపోడు మండల కేంద్రంలో ప్రెస్ క్లబ్ ఏర్పాటుకు సహకరించిన నల్లగొండ జిల్లా యాదవ మహాసభ జిల్లా గౌరవ అధ్యక్షులు తగుళ్ల యాదయ్యను పాత్రికేయులు ఘనంగా సన్మానించారు. గుర్రంపోడు ప్రెస్ క్లబ్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయనకు శాలువా కప్పి కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా తగుళ్ల యాదయ్య మాట్లాడుతూ.. గుర్రంపోడులో జర్నలిస్టుల కోసం ప్రెస్ క్లబ్ ఏర్పాటు కావడం సంతోషకరమని, దీనికి తన వంతు సహకారం అందించడం బాధ్యతగా భావిస్తున్నానని చెప్పారు. సమాజ ప్రగతిలో, ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో జర్నలిస్టుల పాత్ర కీలకమైనదన్నారు. గ్రామీణ ప్రాంతాల సమస్యలపై పాత్రికేయులు నిరంతరం వార్తలు రాస్తూ అధికారులను కదిలించడం అభినందనీయమన్నారు. జర్నలిస్టుల సంక్షేమానికి, ప్రెస్ క్లబ్ అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. పాత్రికేయులంతా ఐక్యంగా ఉంటూ విలువలతో కూడిన జర్నలిజానికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక పాత్రికేయులు, నాయకులు పాల్గొన్నారు.



## మానవత్వం చాటుకున్న గరిడేపల్లి పూర్వ విద్యార్థులు

### బాధితురాలి కూతురు పేరిట రూ.22,500 డిపాజిట్

**గరిడేపల్లి, సెప్టెంబర్ 9 (జనంసాక్షి):**

కలిసి చదువుకోవడమే కాదు, కష్టాల్లో ఆదుకోవడమే నిజమైన స్నేహమని నిరూపించారు. గరిడేపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2005-06 ఎస్ఎస్సీ బ్యాచ్ కు చెందిన విద్యార్థులు తమ సహ విద్యార్థిని మర్రి శ్రీదేవికి అండగా నిలిచారు. శ్రీదేవి గరిడేపల్లి జడ్పీహెచ్ఎస్ లో పదవ తరగతి వరకు చదివి దిర్శించర్ల గ్రామానికి చెందిన పంగ సైదులును వివాహం చేసుకున్నారు. అన్యోన్యంగా సాగుతున్న వారి జీవితంలో భర్త సైదులు అకాల మరణంతో ఆ కుటుంబం దిక్కుతోచని స్థితిలో పడింది.విషయం తెలుసుకున్న చిన్ననాటి స్నేహితులు చలించిపోయారు. తలా కొంత సేకరించి రూ. 22,500 నగదును ఆమె కూతురు పేరిట డిపాజిట్ చేశారు. తమను మర్చిపోకుండా ఆపదలో ఆదుకున్న మిత్రులకు శ్రీదేవి కృతజ్ఞతలు తెలిపారు. వారు అందించిన సాయాన్ని పిల్లల చదువులకు ఉపయోగిస్తానని తెలిపారు. కష్టకాలంలో ఆదుకున్న పూర్వ విద్యార్థులను గ్రామస్తులు ఉపాధ్యాయులు అభినందించారు.



### అర్ధరాత్రి పోలీస్ స్టేషన్లలో ఎస్పీ ఆకస్మిక తనిఖీలు

## విజిబుల్ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి..

### రాత్రివేళ గస్తీ ముమ్మరం చేయాలని ఆదేశాలు

### సీసీ కెమెరాల పర్యవేక్షణ, డయల్-112 స్పందనపై ఎస్పీ రోహిత్ రాజు సమీక్ష

**కొత్తగూడెం క్రైమ్, సెప్టెంబర్ 09 (జనంసాక్షి):**

జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ మంగళవారం అర్ధరాత్రి చుంచుపల్లి పోలీస్ స్టేషన్‌తో పాటు జిల్లా పోలీస్ కంట్రోల్ రూమ్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం కంట్రోల్ రూమ్‌లో సీసీ కెమెరాల ద్వారా జరుగుతున్న పర్యవేక్షణను పరిశీలించి అనుమానాస్పద కదలికలను ఎప్పటికప్పుడు గుర్తిస్తూ సంబంధిత అధికారులకు తెలియజేయాలని సూచించారు. అలర్టింగ్ ఆఫీసర్లు, రౌండింగ్ అధికారులు క్షేత్రస్థాయి సిబ్బందితో సమన్వయంతో పనిచేస్తూ రాత్రి వేళల్లో పోలీసుల నిఘాను మరింత బలోపేతం చేయాలని ఆదేశించారు.రాత్రి సమయంలో పెట్రోలింగ్, బ్లూ కోల్ట్స్ వాహనాలతో నిరంతరం గస్తీ నిర్వహిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రధాన రహదారులు, జనసంచారం తక్కువగా ఉండే ప్రాంతాల్లో పోలీసుల విజిబిలిటీ పెంచాలని ఆదేశించారు.సస్పెక్ట్ షీట్లు, రౌడీ షీట్లను నిరంతరం సమీక్షిస్తూ, సంబంధిత వ్యక్తుల కదలికలు, కార్యకలాపాలపై నిఘా కొనసాగించాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.డయల్-112కు ఫోన్ వచ్చిన వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులకు తక్షణ సహాయం అందించాలని సిబ్బందికి సూచించారు.



## ఖమ్మంలో ప్రైవేటు ఉద్యోగాల ఖాళీల భర్తీకి జాబ్ మేళా?

### జిల్లా ఉపాధికల్పన అధికారిణి మాధవి

**ఖమ్మం కార్పొరేషన్, సెప్టెంబర్ 9(జనంసాక్షి)**
ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు ప్రైవేటు రంగంలో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఈ నెల 11 న (శుక్రవారం) నాడు ఖమ్మంలోని హవేలీ రెస్టారెంట్ ఎదురుగా ఉన్న టీటీడీసీ నందు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎన్. మాధవి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళా ద్వారా ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లో 'సెంటర్ మేనేజర్ / -రూరల్ మైక్రో లోన్స్' విభాగంలో 20 ఖాళీలను భర్తీ చేయనున్నారన్నారు. పదో తరగతి, ఐటీఐ, ఇంటర్, డిప్లొమా లేదా ఏదైనా డిగ్రీ విద్యార్హత కలిగి, 18 నుండి 30 సంవత్సరాల వయస్సు ఉన్నవారు వీటికి అర్హులని తెలిపారు. ఎంపికైన వారికి నెలకు రూ. 15,000 జీతంతో పాటు ఇన్సెంటివ్‌లు ఉంటాయన్నారు. అలాగే రిలయన్స్ జియో ఖమ్మం విభాగంలో 'ఫీల్డ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్'గా 5 ఖాళీలు ఉన్నాయని ఉపాధి కల్పనాధికారిణి తెలిపారు. పదో తరగతి లేదా ఇంటర్మీడియట్ పూర్తి చేసి, 18 నుండి 25 సంవత్సరాల వయస్సు ఉన్న యువకులు ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ. 14,000 నుండి రూ. 25,000 వరకు వేతనం అందజేస్తారని తెలిపారు. అర్హత, ఆసక్తి ఉన్న ఖమ్మం జిల్లా నిరుద్యోగ యువతీ యువకులు తమ విద్యార్హతల సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలతో శుక్రవారం రోజున జరిగే జాబ్ మేళాకు హాజరుకావాలని అన్నారు. ఇతర వివరాల కోసం 9448241214 లేదా 9391539320 ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చని జిల్లా ఉపాధి అధికారిణి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

◆ తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తిని కొనసాగించాలి

◆ సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పోకల వెంకటేశ్వర్లు



**గరిడేపల్లి, సెప్టెంబర్ 9 (జనంసాక్షి):** పేద ప్రజల బతుకులు మారడం కోసం పోరాడేది ఎర్రజెండా పార్టీలేనని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పోకల వెంకటేశ్వర్లు అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా బుధవారం గరిడేపల్లి మండలంలోని రంగాపురం గ్రామంలో పోటు ఎర్రమ్మ, రాఘవయ్య స్థూపాలను, వెలిదండ గ్రామంలో మేదరమెట్ల మట్టయ్య స్థూపాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూస్వాములు, దేశ్‌ముఖ్‌లు, జమీందార్లకు వ్యతిరేకంగా పోరాటం చేసి వేలాది గ్రామాలను విముక్తి చేసి, పది లక్షల ఎకరాల భూములను పేదలకు పంచిన ఘనత కమ్యూనిస్టు పార్టీదేనని అన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో నాలుగు వేల మంది అమరుల త్యాగం వెలకట్టలేనిదన్నారు. సమ సమాజ నిర్మాణం కోసం, ఎర్రజెండా రాజ్యం కోసం ప్రజలందరూ పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి కడియాల అప్పయ్య, రంగాపురం సర్పంచ్ కట్ట కళ్యాణి, మండల కార్యవర్గ సభ్యులు తిరగమల్ల కిరణ్, కట్ట అశోక్, గ్రామ కార్యదర్శి కుంభం వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## చీకటిమామిడిలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య దిష్టిబొమ్మ దహనం



**బొమ్మలరామారం సెప్టెంబర్ 9 (జనంసాక్షి)** మండలంలోని చీకటిమామిడి గ్రామంలో బిఆర్ఎస్ నాయకులు బుధవారం గ్రామశాఖ అధ్యక్షులు బుర్ర నరసింహ ఆధ్వర్యంలో ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య దిష్టిబొమ్మలను దహనం చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారుడు, మలిదశ తెలంగాణ ఉద్యమంలో ప్రాణ త్యాగానికి సిద్ధపడ్డ వ్యక్తి, తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసి దాడులకు ప్రేరేపించేలా వ్యవహరించిన బీర్ల ఐలయ్య తీరును ఖండిస్తూ దిష్టిబొమ్మను దాహనం చేసినట్లు తెలిపారు. ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య నోరు అదుపులో పెట్టుకోవాలని మా నాయకుడు కేసీఆర్ ను విమర్శించే స్థాయినీది కాదని మండిపడ్డారు. ఎమ్మెల్సీ తాతా మధు వ్యాఖ్యలను వక్రీకరించి ఎర్రవల్లి లోని కెసిఆర్ ఫామ్ హౌస్ ముందు చావు డప్పు కొడతామని మాట్లాడడం బీర్ల ఐలయ్యకు సరికాదని సూచించారు. కెసిఆర్ పదేళ్ల కాలంలో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అగ్రస్థానంలో నిలిపారని అలాంటి మహనీయుని దిష్టిబొమ్మను కాంగ్రెస్ కుండాలు దహనం చేయడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. రాష్ట్రానికి మంచి చేసిన మహనేత కేసిఆర్ పై బహిరంగంగా మరణాన్ని కోరుతూ ప్రాణహాని చేయడానికి యత్నించిన మిమ్మల్ని ఉపేక్షించేది లేదని అన్నారు. రాజ్యాంగ పదవిలో ఉండి మాజీ సీఎంకు బెదిరింపులు, హింసకు ప్రేరేపించేలా చావు డబ్బు కొడతామంటూ వ్యాఖ్యానించడం పై తీవ్రంగా వండిపడ్డారు. మరొకసారి మా నాయకుడు కేసీఆర్ గురించి మాట్లాడితే సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు మానుక రాజు యాదవ్, కాసుల స్వామి బిఆర్ఎస్ నాయకులు బూడిద మల్లేష్, తిప్పారం భాను ప్రకాష్, రాగుల అనిల్, మోత్కుపల్లి నరసింహ, చింటూ,భాను, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



## అర్హులైన జర్నలిస్టులకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు కేటాయించాలి

### గృహనిర్మాణ పథకం ద్వారా రూ.5 లక్షలు మంజూరు చేయాలి

**హుజూర్‌నగర్, సెప్టెంబర్ 9 (జనంసాక్షి):** పట్టణంలోని ఫణిగిరి రామస్వామి గుట్టవద్ద గత ప్రభుత్వ హాయంలో జర్నలిస్టులకు కేటాయించిన ఇండ్ల స్థలాలకు పొజిషన్ ఇచ్చి గృహనిర్మాణ పథకం ద్వారా రూ.5 లక్షల నిధుల కేటాయింపు చేయాలని కోరుతూ హుజూర్ నగర్ తహసిల్దార్ బండా కవిత, మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్, కమిషనర్ కే. సతీష్ లకు వినతిపత్రం అందజేశారు. బుధవారం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జర్నలిస్టులు ఎటువంటి జీత భత్యాలు లేకుండా ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా, ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా పనిచేస్తున్న అర్హులైన జర్నలిస్టులకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. ఈ విషయమై రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ని కలుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో హుజూర్ నగర్ ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు పాల్గొన్నారు.




## కల్మలచెర్వు బిడ్డకు పీహెచ్‌డీ పట్టా ప్రదానం

◆ పీహెచ్‌డీ పట్టా అందుకున్న రెగట్టి రాధిక

◆ చరిత్ర విభాగంలో పరిశోధనకు గుర్తింపు

**గరిడేపల్లి, సెప్టెంబర్ 9 (జనంసాక్షి):** ఉస్మానియా విశ్వవిద్యాలయ 85వ స్నాతకోత్సవ వేడుకలు మంగళవారం హైదరాబాద్‌లోని టాగూర్ ఆడిటోరియంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి తెలంగాణ గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లా, భారత్ బయోటెక్ సీఎండీ పద్మశ్రీ డాక్టర్ కృష్ణ ఎల్లా, వీసీ ప్రొఫెసర్ కుమార్ మొలుగరం హాజరయ్యారు. ఈ వేడుకల్లో సూర్యాపేట జిల్లా కల్మలచెర్వు గ్రామానికి చెందిన రెగట్టి రాధిక చరిత్ర విభాగంలో పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. ప్రొఫెసర్ బి.లావణ్య పర్యవేక్షణలో ఆమె పరిశోధన చేశారు. ప్రస్తుతం ఆమె తెలంగాణ గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ లా కాలేజీ పురుషుల సంగారెడ్డిలో చరిత్ర అధ్యాపకురాలిగా పని చేస్తున్నారు. భర్త రెగట్టి అజయ్ ప్రోత్సాహంతో పరిశోధన పూర్తి చేసిన రాధిక పట్టా అందుకోవడం పట్ల కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు హర్షం వ్యక్తం చేశారు.

## పేదలకు కష్టకాలంలో తోడుగా.. ఆరోగ్యానికి నమ్మకంగా.. సీఎం రిలీఫ్ ఫండ్

### మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు

### లబ్ధిదారులకు 1,69,500/- రూపాయల సీఎం సహాయనిధి చెక్కుల అందజేత..



చండూరు, సెప్టెంబర్ 9 (జనంసాక్షి) కష్టకాలంలో నిరుపేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ అండగా నిలుస్తోందని చండూరు మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు అన్నారు. బుధవారం స్థానిక మున్సిపాలిటీ ఆవరణలో ఆరుగురు లబ్ధిదారులకు మొత్తం రూ.1,69,500 విలువైన సీఎం సహాయనిధి చెక్కులను చైర్మన్, కౌన్సిలర్లు కలిసి అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, ఆరోగ్యానికి పూర్తి భరోసా కల్పిస్తోందన్నారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా వైద్య చికిత్సకు అవసరమైన ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఎంతోమంది నిరుపేదల ప్రాణాలు నిలబడుతున్నాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో వైద్యం, విద్యకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. మునుగోడు నియోజకవర్గ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కృషితో పలువురు పేద కుటుంబాలు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ప్రయోజనం పొందుతున్నారని చైర్మన్ తెలిపారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. చెక్కులు అందుకున్న వారిలో చిలుకూరు శ్రీనివాసులు రూ.39,000, భూతరాజు లక్ష్మమ్మ రూ.16,000, చొప్పరి నరసింహ రూ.40,000, గొర్లకొండ పవన్‌కుమార్ రూ.26,000, ఖమ్మంపాటి శివమణి రూ.22,500, బొమ్మకట్టి లక్ష్మి రూ.26,000 ఉన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కోడి సుష్మా వెంకన్న, కలిమికొండ పారిజాత జనార్ధన్, బుషిపాక వాసు, చేనేత సహకార సంఘం అధ్యక్షులు పున్న ధర్మేందర్, కో-ఆప్షన్ సభ్యులు కల్లెట్ల చంద్రకళ మారయ్య, ఖలీల్, కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షులు ఐతరాజు మల్లేష్, పన్నాల లింగయ్య, భీమనపల్లి శేఖర్, బొమ్మరబోయిన వెంకటేశం, కన్నెబోయిన నాగరాజు, బెల్లంకొండ శేఖర్, గజ్జల కృష్ణారెడ్డి, కారింగు మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

## రామన్నగూడెం గ్రామంలో ప్రత్యేక సమగ్ర ఓటర్ సవరణ కార్యక్రమం

**జాజిరెడ్డిగూడెం మండల(జనంసాక్షి)** ప్రత్యేక సమగ్ర ఓటరు సవరణ కార్యక్రమాన్ని గ్రామాల్లోని బీఎల్ఓలు సక్రమంగా చేయాలని మండల తహశీల్దార్ భాషపాక శ్రీకాంత్ అన్నారు. బుధవారం మండలంలోని రామన్న గూడెం గ్రామపంచాయతీ కార్యాలయంలో బీఎల్ఓలతో నిర్వహించిన సమావేశంలో ఆయన పలు సూచనలు చేశారు. ఎన్యూమరేషన్ ఫారంలో తప్పులను నింపడం ద్వారా ఓటర్లకు వచ్చిన నోటీసులను వారికి అందజేసి వివరించి ఓటు పోకుండా ఉండేందుకు ఆధారాలను అందజేయాలని సూచించారు. ఈ సందర్భంగా స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కర్నాటి వెంకన్న, ఉపసర్పంచ్ లింగంపల్లి రవిదర్, పంచాయతీ కార్యదర్శి లింగంపల్లి సుధాకర్, అంగన్వాడీ టీచర్ పుష్పలత, వార్డు సభ్యులు నర్సింహ్మ, మాగి మీనాక్షి, గంట రవి, ముధావత్ తనేష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పోతునూరు పంచాయతీ పరిధిలో

## ఘనంగా కాళోజీ జయంతి

### నీటి పొదుపుపై అవగాహన సదస్సు



పెద్దవూర సెప్టెంబర్ 9 (జనంసాక్షి ) స్థానిక పోతునూరు గ్రామపంచాయతీ కార్యాలయం ప్రాంగణంలో ప్రజాకవి, పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు గారి జన్మదిన వేడుకలను బుధవారం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాళోజీ చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ భాషా సాంస్కృతిక వికాసానికి, ప్రజా చైతన్యానికి కాళోజీ చేసిన సేవలను నాయకులు, అధికారులు స్మరించుకున్నారు. అనంతరం తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న 'జల జీవన్ మిషన్' కార్యక్రమంలో భాగంగా గ్రామ ప్రజలకు నీటి పొదుపుపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. తాగునీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని, వర్షపు నీటిని భూగర్భంలోకి మళ్లించే విధంగా ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అధికారులు సూచించారు. అదేవిధంగా గ్రామంలో పరిశు భ్రతకు ప్రాధాన్యమిస్తూ, గ్రామ పరిధిలో రోడ్ల ఇరువైపులా ఉన్న కంప చెట్లను (ముళ్ల పొదలను) తొలగించే పారిశుధ్య కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పెండ్యాల సంతోష్ రావు, గ్రామ కార్యదర్శి సంతోష్ రెడ్డి, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ మోతిలాల్, ఉప సర్పంచ్ బొద్దుపల్లి వెంకటయ్య, వివిధ వార్డుల వార్డు మెంబర్లు, గ్రామపంచాయతీ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు మరియు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రజల గొంతుకగా నిలిచిన

## ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి

### ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్) ఘన నివాళులు!!



కొత్తగూడెం క్రైమ్, సెప్టెంబర్ 09(జనంసాక్షి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పట్టణంలోనిప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్)లో తెలుగు శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ ప్రజాకవి, పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాళోజీ నారాయణరావు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, ఆయన తెలుగు సాహిత్యానికి, తెలంగాణ సమాజానికి అందించిన విశిష్ట సేవలను స్మరించుకున్నారు. ప్రజల సమస్యలను, సామాజిక అంశాలను తన రచనల ద్వారా ప్రతిబింబించిన కాళోజీ సాహిత్య సేవలను వక్తలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో తెలుగు శాఖాధిపతి డా. ఎస్. స్వరూపారాణి మాట్లాడుతూ కాళోజీ రచనలు ప్రజల్లో చైతన్యాన్ని, సామాజిక స్పృహను కలిగించాయని పేర్కొన్నారు. ఆయన సాహిత్యం నేటి తరానికి కూడా స్ఫూర్తిదాయకమని తెలిపారు. తెలుగు అధ్యాపకుడు ఈ. శ్రీను మాట్లాడుతూ కాళోజీ నారాయణరావు తెలంగాణ ప్రజల హక్కులు, సమస్యలు మరియు సామాజిక విలువల కోసం తన రచనల ద్వారా గొంతుకగా నిలిచారని అన్నారు. యువత కాళోజీ సాహిత్యాన్ని అధ్యయనం చేసి ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ జె మాధవి, డాక్టర్ టి అరుణ్ కుమారి విజయ ప్రసాద్ డాక్టర్ వేముల కామేశ్వరరావు పొట్ల పువ్వు శ్రీనివాసరావు పారెల్లి శ్రీనివాస్ కోటగిరి రాంబాబు డాక్టర్ ఎన్ శ్రీదేవి లీల విమల దీపిక కరీమా హారిక ధర్మారావు డాక్టర్ రమేష్ ఇతర అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొని కాళోజీ నారాయణరావుకు ఘన నివాళులు అర్పించారు.



## ఉయ్యాలవాడలో గ్రామపంచాయతీ లో

## కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలు

జాజిరెడ్డిగూడెం మండల సెప్టెంబర్- 9 ( జనంసాక్షి ) జాజిరెడ్డిగూడెం మండల పరిధిలోని ఉయ్యాలవాడ గ్రామపంచాయతీలో తెలంగాణ కవి కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కరుణ భాస్కర్ రెడ్డి కాళోజీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



జాజిరెడ్డిగూడెం గ్రామంలో కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలు

జాజిరెడ్డిగూడెం గ్రామపంచాయతీలో ప్రజా కవి కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ బింగి కృష్ణమూర్తి కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అశోక్, బిల్ కలెక్టర్ మాగి నాగయ్య, వార్డు సభ్యులు నిమ్మల సందీప్, బొల్లం సైదులు, ప్రవీణ్, ఎల్లంల కొమురెల్లి, నర్సింగ శ్రీనివాస్, ఏఎన్ఎం సైదమ్మ, శకుంతల, ఆశ కార్యకర్త సైదమ్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఘనంగా కాళోజీ నారాయణరావు

## జయంతి వేడుకలు

చింతలపాలెం(జనంసాక్షి) కాళోజీ నారాయణరావు తెలంగాణ ప్రజల గొంతుకగా నిలిచిన గొప్ప ప్రజా కవి. ఆనాటి నిజాం పాలనను, అన్యాయాలను తన కలం ద్వారా ధైర్యంగా ఎదిరించిన ధీశాలి. కాళోజీ జన్మదినాన్ని తెలంగాణ ప్రభుత్వం తెలంగాణ భాషా దినోత్సవంగా అధికారికంగా నిర్వహిస్తుంది. ఈ సందర్భంగా కాళోజీకి మండల ప్రజా పరిషత్ పాఠశాల ఎస్సీ కాలనీ దొండపాడులో పుష్పాంజలి అర్పిస్తూ ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది. పిల్లలకు కాళోజీ గొప్పతనాన్ని తెలియజేస్తూ నేటితరం పిల్లలు వారిని ఆదర్శంగా తీసుకొని తెలంగాణ అభివృద్ధికి కృషి చేయాలని కోరటం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసచారి ఉపాధ్యాయులు రాజేష్,సుమ,యామి ని,సుజాత భవిత సెంటర్ సిబ్బంది నరసింహారావు,లక్ష్మి పాల్గొన్నారు.




## ఘనంగా కాళోజి జయంతి వేడుకలు

నూతనకల్ సెప్టెంబర్ 9 (జనంసాక్షి) మండల పరిషత్ కార్యాలయంలో కాళోజి నారాయణరావు జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎంపీడీవో సునీత మాట్లాడుతూ కాళోజి నారాయణరావు జయంతిని తెలంగాణ ప్రభుత్వం తెలంగాణ భాషా దినోత్సవంగా అధికారికంగా జరుపుతున్నారు.. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఆఫీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా తెలంగాణ భాషా దినోత్సవం

కోదాడ,చిలుకూరు, సెప్టెంబర్ 09(జనంసాక్షి): కెఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రజాకవి, స్వాతంత్ర్య సమరయోధులు, పద్మ విభూషణ్ కాళోజీ నారాయణరావు జయంతి వేడుకల సందర్భంగా తెలంగాణ భాషా దినోత్సవ వేడుకలు ఎన్ఎస్ఎస్ విభాగం (జాతీయ సేవా పథకం) ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్చార్జ్ ప్రిన్సిపాల్, ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రాం అధికారి వేముల వెంకటేశ్వర్లు కాళోజీ చిత్రపటానికి పూలమాలలు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు. తదనంతరం వేముల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... బడి పలుకుల భాష కాదు- పలుకుబడుల భాష కావాలని, ఏ భాష నీదిరా ? ఏ యాస నీది రా? మాట్లాడే భాష ప్రజల భాషరా అని సొంత మట్టి భాషకు పట్టాభిషేకం చేసిన ఆయన కలం నిరంతరం నిజాం నిరంకుశత్వంపై, ప్రజా పోరాటాలపై, రాచరికపు అణచివేత పై నిప్పులు చిమ్మింది అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది జి.యాదగిరి,వి. బల భీమారావు, ఆర్.రమేష్,పి. రాజేష్,ఎం. రత్నకుమారి,బి. రమేష్ బాబు,జి. వెంకన్న,కె. రామరాజు,జి.రవి కిరణ్,కె.సతీష్,జి. నాగరాజు,ఎస్. గోపికృష్ణ, ఈ నరసింహారెడ్డి,ఎస్. కె.ముస్తఫా, జె తిరుపతయ్య, ఎస్కె ఆరిఫ్ అలీ, కలకొండ శాంతయ్య, ఎన్ జ్యోతిలక్ష్మి,ఆర్ చంద్రశేఖర్, ఎస్ వెంకటేశ్వరచారి,టి మమత, డి ఎస్ రావు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.



## ఘనంగా ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలు



ఖమ్మం కార్పొరేషన్, సెప్టెంబర్- 9 ( జనంసాక్షి ) తెలంగాణ వైతాళికుడు, ప్రజాకవి, పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు జయంతి (తెలంగాణ భాషా దినోత్సవం) వేడుకలు కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాళోజీ నారాయణరావు చిత్రపటానికి శిక్షణ సహాయ కలెక్టర్ పారస్ కుమార్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పారస్ కుమార్ మాట్లాడుతూ, సమాజంలోని అన్యాయాలను, అక్రమాలను తన కలం బలం ద్వారా ఎండగట్టిన మహోన్నత వ్యక్తి కాళోజీ అని కొనియాడారు. తెలంగాణ భాష, యాస, సంస్కృతి పరిరక్షణకు ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ప్రజాచైతన్యమే ఊపిరిగా జీవించిన కాళోజీ జీవితం నేటి తరానికి ఆదర్శనీయమని, ఆయన చూపిన బాటలో, అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, కేర్ టేకర్ వెంకన్న, సిబ్బంది, ప్రభుత్వ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొని కాళోజీ నారాయణరావు సేవలను స్మరించుకుంటూ నివాళులు అర్పించారు.

## కల్లూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో

## ఘనంగా కాళోజీ జయంతి వేడుకలు

కల్లూరు సెప్టెంబర్ 09(జనం సాక్షి) కల్లూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రజాకవి, ప్రముఖ సాహితీవేత్త, స్వాతంత్ర్య సమరయోధుడు కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. కాళోజీ నారాయణరావు చిత్రపటానికి సబ్ కలెక్టర్ కార్యాలయం అధికారులు సిబ్బంది పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, కాళోజీ నారాయణరావు తన రచనలు, కవిత్వం ద్వారా ప్రజల సమస్యలను, సామాజిక అసమానతలను, ప్రజాస్వామ్య విలువలను సమాజం ముందుకు తీసుకువచ్చారని పేర్కొన్నారు. తెలంగాణ భాష, సంస్కృతి, ప్రజల హక్కుల పరిరక్షణ కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. కాళోజీ సాహిత్యం ప్రజల్లో చైతన్యం, సామాజిక బాధ్యత, న్యాయం పట్ల అవగాహన కలిగించిందని, ఆయన ఆశయాలు ప్రజాసేవా స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ కార్యాలయ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

